ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

13/11 Entered Krishna 14/11

నవంబర్ 13, 2005

బాల కార్మికులు ఇంకానా...?

నవ్వించడమేకాదు, ఏడిపిస్తా కూడా!

సినిమా కబుర్లు

రంగులకు గుణముంది

నేర్చుకుందాం రా...

ఆ జగజ్జేత వెనుదిరగడం...

టర్నింగ్ పాయింట్

హ్యాపీ బర్త్‌డే

(13.11.2005 నుంచి 19.11.2005 వరకు)

ఎస్. రమ్య
నవంబర్-13
వరలక్ష్మి-రాజు
విశ్వేశ్వరాయపురం-తూ॥గో॥

డి.కె.కె. సాయికృష్ణ
2సం॥, 13.11.2003
రజని-రాజేష్
కంచరపాలెం-విశాఖపట్నం

చరిష్మాశ్రీజ
2సం॥, 13.11.2003
రోజారాణి-విమల్‌శంకర్
ఆరిలోవ-విశాఖపట్నం

పి. హర్షిత్‌రెడ్డి
2సం॥, 14.112003
సురేంద్ర
అదోని

ఎం. బాలవర్ధన్
2సం॥, 14.112003
పద్మ-వెంకటేష్
దమాగ్నపూర్-మ॥నగర్

బి. ప్రసాన
నవంబర్-14
కవిత-రత్నాకర్
బొంతగట్టునాగారం-వరంగల్

బి. భవ్య
3సం॥, 15.112002
లక్ష్మి-భాస్కర్
అమరచింత-మ॥నగర్

ఆర్. చెష్మితాజ్
3సం॥, 17.11.2002
షంషాద్-ఇస్మాయిల్ జబీల్
ముదిగుబ్బ-అనంతపురం

సాహిత్య
1సం॥, 18.11.2004
విజయ-యోగానంద్
బ్రాహ్మణపల్లి-మ॥నగర్

కె. వరుణ్‌సాయి
2సం॥, 17.11.2003
విజయలక్ష్మి-ఉపేందర్‌రావు
వెంకటాపురం-ఖమ్మం

డి. శివదుర్గాప్రసాద్
3సం॥, 19.11.2002
రాజేశ్వరి-రాజయ్య
డోర్నకల్-వరంగల్

ఎ. సుజిత
6సం॥, 1911.1999
మహాలక్ష్మి-సువర్ణరాజు
శింగరాయకొండ-ప్రకాశం

గీతాశ్రీ
1సం॥, 19.11.2004
కళావతి-శ్రీనాథరావు
నడుకూరు-శ్రీకాకుళం

టి. అఖిల్
10సం॥, నవంబర్-1995
లత-శ్రీను
జిందల్‌నగర్-విజయనగర్

అడవయ్య
8సం॥, 10.11.1997
రమాదేవి-అభిలాష్
లాలాపేట

ఎ. శ్రీరాజ్
1సం॥, నవంబర్-2004
స్వరాజ్యం-నర్సింహ్మా
పార్సీగుట్ట-సికింద్రాబాద్

పి. వెంకటేష్
6సం॥, నవంబర్-1999
యాదమ్మ-శ్రీనివాస్
వినాయక్‌నగర్-మల్కాజ్‌గిరి

వర్షిత
2సం॥, నవంబర్-2003
సంధ్య-రమేష్
రాజుపాత్రునిపాలెం-విజయనగరం

ఎస్. తేజస్వి
5సం॥, నవంబర్-2000
అనంతలక్ష్మి-శ్రీనివాసరావు
పెద్దాపురం-తూ॥గో॥

ఎం. మానస
లక్ష్మీదేవి-లక్ష్మీనారాయణయాదవ్
శంకరబండ-కర్నూలు

ఈ వారం అతిథి



మన అతిథి గురించి...

పేరు : చేకూరి రామారావు
పుట్టిన ఊరు : ఇప్పటి ఖమ్మంజిల్లా ఇల్లెందులపాడు
పుట్టిన తేదీ : 1 జులై 1935
విద్య : తెలుగు ఎం.ఏ. భాషాశాస్త్రం ఎం.ఏ.పి.హెచ్‌డి.
వృత్తి : ఉస్మానియా యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీ, తెలుగు యూనివర్సిటీలలో లెక్చరర్, రీడర్, ప్రొఫెసర్‌గా చేశారు.
నచ్చిన వ్యక్తి : మంచివాళ్లందరూ. ముఖ్యంగా నాయని నరసింహారావు గారంటే ఇష్టం.
నచ్చని అంశం: ఒర్తి గొప్పలు చెప్పకోవడం
హాబీ : చదువుకోవడం. జ్ఞానసంపాదనకు మించిన హాబీ ఏముంటుందంటారు.

జ్ఞానసంపాదన పెరగాలి

విలువలు వడిపోతున్నాయి... నశించిపోతున్నాయి అనలేను కానీ తగ్గిపోతున్నాయనేది మాత్రం గమనించదగ్గ అంశం. ఇది మన ఒక్క సమస్యే కాదు. చైనాలో, రష్యాలో ఏం జరుగుతోందనేది పేపర్లలో చూస్తుంటే ప్రపంచమంతా విలువలనేవి తగ్గిపోతున్నాయని అనకతప్పదు. దీనికి ఎవరో యుగకర్త వస్తాడని...మళ్లీ విలువల్ని నిలబెడతాడనేటువంటి నమ్మకాలేం నాకు లేవు.

తెలుగుభాష మీద నేనేం పరిశోధన చేశాను...ఇంకా ఏం శోధించాలనేది నాలో ఇప్పటికీ ఆసక్తి, జిజ్ఞాస ఏమాత్రమూ తగ్గలేదు. జ్ఞానసాధనమీద నేటికీ చాలా ఆసక్తి ఉంది. ప్రాచీన భాషలో ఏం ఉంది, ఆ వ్యాకరణం ఏం చెప్పింది, ఇతర భాషల్లో విశేషాంశాలేంటి తెలుసుకుందామని ఇప్పటికీ నాలో ఉంది. కానీ ఇప్పటి తరంవారిలో చూస్తే అలాంటి కొత్తవిషయం ఏదన్నా తెలుసుకుందామనే ఆసక్తి పెద్దగా ఉన్నట్లు కన్పడ్డంలేదు. మిగతా సబ్జెక్టులతో పోల్చుకుంటే భాషాశాస్త్రం కొంతలో కొంత నయమనుకోండి. కానీ నేటి తరంవాళ్లు కేవలం తమ క్లాసు పుస్తకాలకే పరిమితమైపోయి ఉన్నారు. ఇంకా కొత్తతరమయితే పరీక్షలు, మార్కుల పరిధి దాటి బయటకు రావడమే లేదు. నాలుగుపుస్తకాలు చదివి నాలుగు విషయాలు తెలుసుకుని జ్ఞానాన్ని పెంచుకుందాం అనేకంటే నాలుగురాళ్లు ఎలా సంపాదిద్దామా అనే ఆలోచనే ఎక్కువగా ఉంది. ఎందుకో గానీ ఈ సమాజం మనుషులలో వ్యాపారదృష్టి, డబ్బు సంపాదనా దృష్టి, ఆస్తులు కూడగట్టుకునే దృష్టి బాగా కలిగిస్తోంది.

కంట్రోలు లేకపోతే అభివృద్ధి అనేది వినాశనానికి దారితీస్తుంది. ఉదాహరణకు శాస్త్ర సాంకేతికాభివృద్ధి అయిన టెలీవిజన్‌ను చూడండి...దానికి గానీ తాళం వేయకపోతే రేపటి తరంలో విలువలు ఇంకా తగ్గిపోతాయి. అర్ధరాత్రుళ్లు కొన్ని టీవీఛానళ్లు చాలా అశ్లీలాన్ని చూపిస్తున్నాయి. వాటిని టీనేజి పిల్లలు చూస్తే చదువులు, విద్య అనేవాటిమీద ఆసక్తి పోయి అటువైపు పడిపోతారు. ఛానళ్ల మధ్య పోటీ ఇలాంటివి ఎక్కువ చేస్తున్నాయి.

అమెరికాలో నేను చదువుకునే రోజుల్లో రేడియో మీద ఒక జోకుండేది. వార్తలు విందామని రేడియో పెడితే అక్కడ హత్య, ఇక్కడ మానభంగం, ఇంకెక్కడో దోపిడీ.అనేవే వినబడేవి. అవి తప్పితే ఈ అమెరికాలో ఏం లేవా అనిపించేది. ఇప్పుడు మనదేశంలోనూ అదే పరిస్థితి దాపురించింది. పట్టపగలు రాజధాని నాంపల్లి స్టేషన్ ముందు కారుదోపిడీ గురించి, జనావాసాల్లో హత్యల వార్తలు చూస్తుంటే మనమెంత భద్రత కోల్పోయామో అనిపిస్తోంది. దీన్ని ఈ పాలకులో, ప్రజలో ఎవరు ఎలా నిలువరించాలో మరి...!

చేరా

ఈ సంచికలో...

టపా ... 2
టర్నింగ్‌పాయింట్ 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
నేర్చుకుందాం..రా! 7
క్యాంపస్ ఛాట్ ... 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
సెన్సూ కామన్ సెన్సు 20
ఓ ఊరి కథ ... 21

ఇంకా...

సీరియల్ 19
మాధవి



మనసా తెలుసా 3
తల్లిదండ్రులు పాలకులు
పిల్లలు ప్రతిపక్షాలు

కథ 18
ఆడుకుంటానంకుల్

ఆరోగ్యం ... 17
పప్పెట్ ఇంటర్వ్యూ ... 19
అవీ... ఇవీ 22
విజ్ఞానవీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24

చక్కని కథనం...

ఈ వారం 'స్నేహ' మేగజైన్‌లో అట్టమీది కథ 'టూరింగ్ నుండి ఐ మాక్స్' సినిమా ఆవిర్భావాన్ని, దాని అభివృద్ధి కోసం మహామహులు చేసిన కృషిని వివరించింది. కృష్ణాజిల్లా బందరు పట్టణంలో ఎంతో పురాతనమైన మినర్వా థియేటర్ నుంచి నేటి దక్షిణభారత దేశానికే మొట్టమొదటి ఐమాక్స్ థియేటర్ వరకు చక్కని కథనాన్ని సరైన చిత్రాలతో అందించిన మీకు ధన్యవాదాలు.

సి. సంపూర్ణ చంద్రిక, ఎనికేపాడు, కృష్ణా జిల్లా.



గుర్తుతెచ్చినందుకు

అట్టమీది కథ 'టూరింగ్ నుండి ఐమాక్స్' చదువుతున్నంత సేపు నా చిన్ననాటి విషయాలే గుర్తొచ్చాయి. అప్పట్లో మా ఇంటి ముందు బోల్డు స్థలం ఉండడంతో సినిమాలేసే వాళ్లు. ఓ సారి "సత్యహరిశ్చంద్ర" సిన్మా వేశారు. నేను మా మేడమీద నుంచి చూశాను. ఇందులో చంద్రమతి, లోహితాసుడు పడే బాధలు నిజమనుకుని తెగ ఏడ్చేశా. ఆ కన్నీళ్లు... కాలక్షేపం కోసం తీసుకెళ్లిన వేరుశనక్కాయల మీద పడ్డాయి. తిందామని చూస్తే మెత్తగానూ, ఉప్పగానూ తయారయ్యాయి. ఇవన్నీ నాకు మరల గుర్తుతెచ్చినందుకు కృతజ్ఞతలు. 'అవీ..ఇవీ' లోని చిత్రం, వ్యాఖ్య చాలా నచ్చాయి.

దివ్య, ఖమ్మం

తెలీని విషయాలెన్నో...

వారం వారం 'విజ్ఞానవీచిక'లో ఎన్నో తెలీని విషయాలు తెలుసుకుంటున్నాం. 'ఓ ఊరికథ'లో చారిత్రాత్మకమైన ప్రదేశాలు, వాటి వివరాలు తెలియజేస్తున్నందుకు... ఇంత మంచి శీర్షికలు ప్రచురిస్తున్నందుకు కృతజ్ఞతలు. ఈ వారం 'బాలల కథ' సమదృష్టిలో అందరినీ సమదృష్టితో చూడాలి అనే నీతి బాగుంది.

జెవిఎస్ఆర్ శాస్త్రి, కొత్తగూడెం

పెద్దలూ చదివేలా...

దీపావళి జోక్స్ మమ్మల్నెంతగానో అలరించాయి. సరదాగా నవ్వుకున్నాం. బాలల కథ 'సమదృష్టి' మమ్మల్ని బాగా ఆకట్టుకుంది. పిల్లలేకాక పెద్దలూ చదివేలా ఉంది. మనిషి విలువలను గూర్చి కాక, అతని విషయ పరిజ్ఞానం గురించి చెప్పడం చాలా బాగుంది. ఇలాంటి కథలు మరెన్నో రావాలని కోరుకుంటున్నాం.

జె శ్రావణి, పి. సింధు, వి. రోహిణి, పాల్వంచ

జోకులు ఎంతో బాగున్నాయి.

కడుపుబ్బా నవ్విస్తున్నాయి. 'స్నేహ' అన్ని వయసుల వారినీ అలరించేలా ఉంది. చిక్కగా చక్కగా ప్రతి ఒక్క పేజీకి పరిమితమౌతున్న విషయాలు పాఠకునికి బోరు కొట్టకుండా ఉంటున్నాయి. ఇలా స్నేహను పాఠకులకందిస్తున్న 'ప్రజాశక్తి' రథసారథులకు నా స్నేహాంజలి.

వాసాల నరసయ్య, మెట్పల్లి, కరీంనగర్ జిల్లా

ఎంతో ఆనందించాం

'క్యాంపస్ చాట్'లో మా అనుభవాలను పంచుకున్నాం. వాటిని మీ శీర్షికలో చూసుకున్న తర్వాత మాకెంతో ఆనందం కలిగింది. వీలు దొరికినప్పుడల్లా మాకెదురైన అనుభవాలను రాస్తూ ఉండగలం. మాకిలాంటి అవకాశాన్ని కల్పించినందుకు చాలా థాంక్స్...

డి. ప్రీతి, జె. శ్రావణి, డి. శ్రీవాణి, కొత్తగూడెం

ముచ్చటగా...

'హ్యాపీ బర్త్‌డే' శీర్షికలో చిన్నారుల ఫోటోలెంతో ముచ్చటగా ఉన్నాయి. దీపావళి మతాబుల వెలుగులు వారి ముఖాల్లో కనబడింది. ఇంత చక్కగా పిల్లల ఫోటోలు వేసినందుకు కృతజ్ఞతలు. 'బాలనేస్తాలు'లో మా కోసం వేస్తున్న 'కత్తిరించండి అతికించండి', 'చుక్కలు కలిపేద్దాం', 'రంగులు అద్దండి' 'తేడాలేమి?', 'అమ్మో...సింహం!' ఇవన్నీ చాలా బాగున్నాయి. మేం వీటితో చాలా బాగా ఎంజాయ్ చేస్తున్నాం.

నాని, వసు, కొత్తగూడెం

కలర్‌లో ఉంటే...

'టూరింగ్ నుండి ఐమాక్స్' అంశం ఆద్యంతం ఆసక్తికరంగా ఆకట్టుకుంది. టూరింగ్ టాకీసు స్థాయినుంచి ఐ మాక్స్ హోదా దాకా మనిషి ఎదిగాడన్నట్లు... థియేటర్ల పుట్టుపూర్వోత్తరాలన్నీ మా ముందు కూలంకషంగా అందించారు. ఫోటోలు కలర్‌లో ఉంటే ఇంకా బావుండేది కదా అనిపించింది. 'అవీ... ఇవీ' సహా మిగతా అంశాలన్నీ అలరింపజేశాయి. 'ఓ ఊరి కథ' శీర్షిక చాలా చక్కని శీర్షిక. ఒక కొత్త ఊరికి సంబంధించిన సంగతులన్నీ తెలుసుకోగల సదవకాశం ఈ శీర్షిక ద్వారా లభించినట్లైంది. బాలలకథ చదువుతుంటే చిన్నప్పుడు చందమామ చదివిన మధురజ్ఞాపకాలు ముసురుతున్నాయి.

నేమాన సుభాష్ చంద్రబోస్, ఇలిసిపురం, శ్రీకాకుళం.

మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్,
ఫోన్ : 9849130141

తల్లిదండ్రులు పాలకులు పిల్లలు ప్రతి పక్షాలు

టీనేజి వచ్చినవారిపై విధించే ఆంక్షలను తల్లిదండ్రులే స్వయంగా తయారుచేయాల్సి ఉంటుంది. కాగా ఈరూల్స్‌లో ఎక్కువశాతం టీనేజర్లకు ప్రతిపాదించబడాలి తప్పితే, కస్టమ్స్ నిబంధనలా కరకుగా ఉండకూడదు. ప్రతీకుటుంబానికి, స్వంతంగా కొన్నిరూల్స్ ఉంటాయి. ఉదాహరణకు,

1. స్కూల్ లేదా కాలేజి అయిపోగానే ఇంటికి వచ్చేయాలి.
2. ఇంటికి స్నేహితులు రాకూడదు.
3. ఎవరి బట్టలు వాళ్లే ఉతుక్కోవాలి.

పెట్టే ప్రతీరూల్ ఇటు టీనేజిపిల్లలకు, తల్లిదండ్రులకు నడుమ అనురూప సంబంధాన్ని ఏర్పరిచేదిగా ఉండాలి. అనురూప సంబంధం అంటే, మీరు టీనేజ్‌పిల్లలపై ఏ రూల్ విధిస్తారో, ఆ రూల్‌ని మీరుకూడా ఖచ్చితంగా పాటిస్తూండాలి. 'ఎక్కువసేపు చదువుకో', అని మీరు చెప్పదలిస్తే, ఎక్కువసేపు చదివే వ్యక్తిలా మీరు కన్పించాలి. సిగరెట్ కాల్చకు తప్పు అని మీరు చెప్పదలిస్తే సిగరెట్ తాగని వ్యక్తిగా మీరు తయారుకావాలి. "నేను ఎటూ చెడిపోయాను నువ్వుకూడా చెడిపోకూడదనే ఈరూల్ పెడుతున్నాను." అని మీరు నచ్చచెప్పాలని ప్రయత్నిస్తే అది అతకదు. వారి మనస్సులో ఈ స్టేట్‌మెంట్ వెనుక తర్కం ఉన్నట్టుగా అనిపించదు. ఫలితంగా మీరుపెట్టిన రూల్స్‌ని పిల్లలు వ్యతిరేకించడం మొదలుపెడ్తారు. ఎటువంటి ఆంక్షలను ఆమోదించాలి ? వేటిని ఆమోదించకూడదు. ఒకవేళ ఏ రూల్స్‌ని మీరితే ఎటువంటి పరిణామాలు ఏర్పడతాయి అనే అంశాలపై పిల్లలకు, తల్లిదండ్రులకు నడుమ అంగీకారం కుదరాలి.

ఆంక్షల విషయంలో తల్లిదండ్రులలో ఎవరోఒకరు, మరొకరికి వ్యతిరేకం కాగల అవకాశం ఉందేమోనని తెలుసుకోవటానికి ప్రయత్నిస్తారు. చాలా విషయాల్లో పిల్లలకు వత్తాసు పలికి వారిని వెనకేసుకు వచ్చే తల్లి (కొంతమంది విషయాలలో తండ్రి) రూల్స్ దగ్గరికి వచ్చేసరికి మాత్రం తండ్రితో వంతపాడుతుంది.

రూల్స్, క్లియర్‌గా ఉండాలోచ్

ఉదాహరణకు రాత్రిపూట భోజనానికి పంక్చ్యువాలిటీ అవసరం అని రూల్ పెట్టదలచుకుంటే, సమయానికి హాజరుకావడం అంటే ఏమిటో స్పష్టంగా తెలియాలి. ఒకరూల్‌ని తయారుచేసే వ్యక్తి, ఆ రూల్‌ని విభేదించే వ్యక్తి వేర్వేరు కోణాలలో ఆలోచించడం వల్లనే, రూల్ అమలు కాకుండా పోతుంది. అదేవిధంగా టీనేజిపిల్లల ఇంటిలో తల్లిదండ్రులు ఒక యునైటెడ్ ఫ్రంట్‌గా మారతారు. పిల్లలు ఆ ఫ్రంట్‌ను, అసెంబ్లీలో ఏకిపారేసే విపక్షాలు అవుతారు. విపక్షనేతలైన టీనేజిపిల్లలు తల్లిదండ్రులు చెప్పే సిద్ధాంతాలలో ఎక్కడైనా లొసుగు ఉందేమోనని వెదకడానికి ప్రయత్నిస్తారు. లేదా ఫలానా ఆంక్ష విషయంలో తల్లిదండ్రులలో ఎవరోఒకరు, మరొకరికి వ్యతిరేకం కాగల అవకాశం ఉందేమోనని తెలుసుకోవటానికి ప్రయత్నిస్తారు. చాలా విషయాల్లో పిల్లలకు వత్తాసు పలికి వారిని వెనకేసుకు వచ్చే తల్లి (కొంతమంది విషయాలలో తండ్రి) రూల్స్ దగ్గరికి వచ్చేసరికి మాత్రం తండ్రితో వంతపాడుతుంది. దాంతో పాలక పక్షానిదే గెలుపు అవుతుంది. ఆ రూల్‌కి సంబంధించినంత వరకూ వారిది గెలుపేకానీ పరోక్షంగా తల్లిదండ్రులకు దొరికేది ఓటమేనని డేవిడ్ వీర్‌మాన్ అంటాడు. పాలకవర్గానికి జడిసి టీనేజిపిల్లలు తలూపినా, వారి అంతర్గత వ్యతిరేకత మరో అంశంలో ప్రతిబింబిస్తుంది. ఈ వ్యతిరేకత యొక్క పరిమాణం ఎంతుంటుందో మనం అంచనా వేయలేం. అలాగే ఈ వ్యతిరేకత వలన ఏర్పడే పరిణామాలుకూడా ఎంతవిషమంగా ఉంటాయనేది పర్యవసానాన్ని బట్టి మాత్రమే మనం తెలుసుకోగలుగుతాం. పిల్లలు కేవలం, తమ తల్లిదండ్రులను ఎందుకనో వ్యతిరేకించాలనిపించడం మూలంగా తమకు, తమ తల్లిదండ్రులకు కూడా ఆమోదయోగ్యమైన నిర్ణయాలను వదిలిపెట్టి, అందుకు విరుద్ధమైన నిర్ణయాలను తీసుకోవడం ద్వారా పగసాధిస్తారు. ఈవిధంగా టీనేజిపిల్లలు తమ తల్లిదండ్రులపై గెలుపును సాధించామనుకుంటారు. అయితే పిల్లలు సాధించే ఈ గెలుపుకూడా సరియైన గెలుపు కాబోదని వీర్‌మాన్ అంటాడు. ఎలాగంటే, కేవలం తల్లిదండ్రులను వ్యతిరేకించి తీరాలనే నిర్ణయాలను తీసుకోవడంలో తప్పిదాలను చేయవలసిరావడం వల్ల, తదనంతర కాలంలో ఏర్పడే చెడు పర్యవసానాలకు పిల్లలే బలి అవుతారు.



ఉక్రోషం ఎక్కువే మరి !

ఈ వయసులో పిల్లలకు ఉక్రోషం అధికంగా వుంటుంది. ఇందుకు ప్రధాన కారణం వారిలో శారీరకంగా ఏర్పడే మార్పులే. వారిలో కలిగే హార్మోనుల చర్యల ఫలితంగా రకరకాలైనటువంటి మనోభావాలు, స్పందనలు ఏర్పడతాయి. వీటికి తోడు వారిలో స్వాభిమాన అభిప్రాయాలు మొదలౌతాయి. తమ మనోభావాల పట్ల విపరీతమైన ఆకర్షణ కలుగుతుంది. ప్రేమ ఏర్పడుతుంది. మక్కువ ఏర్పడుతుంది. అవి తమ స్వంత ఆస్తులనే తలంపు కల్గుతుంది. వాటిని ఎలాగైనా కాపాడుకోవాలనే మంకుపట్టు ఏర్పడుతుంది. ఆ ఆస్తులను చెదరగొట్టే ఏ ప్రయత్నానికైనా వీరు ఒప్పుకోరు. అలా ప్రయత్నించే వారి పట్ల చాలా కఠినంగా వ్యవహరించాలని భావిస్తారు. తిరుగుబాటు తత్వాన్ని చూపెడతారు. ఏమైనా సరే వాటిని నెగ్గించుకోవాలని, అవి ముమ్మాటికీ నిజమైనవేనని అందరి చేత అన్పించాలని తాపత్రయ పడతారు. ఈ తాపత్రయంలో వారు నెగ్గే పరిస్థితి కాన రానప్పుడు తీవ్రమైన మనోక్షోభకు గురౌతారు. సాధారణంగా తమ మనోవైఖరికి తమ కుటుంబసభ్యులనుండే తొలుత మద్దతునాశిస్తారు. ఒకవేళ తమ ప్రవృత్తికి ఇక్కడే ఆటంకమేర్పడితే అది వీళ్ళు తట్టుకోలేరు. అలాగని తమ పెద్దవాళ్ళను తిరస్కరించి నెగ్గలేరు. పెద్దవాళ్ళను లెక్కచేయకుండా వుండనూలేరు, వారిని తిరస్కరించకుండానో, లేక ఎదురించకుండానో తలాడిస్తూ గడపనూలేరు. తమ మనోభావాలను ఇలా పణంగాపెట్టి సంఘర్షణ పాలుకావడం వీరికి సుతరామూ ఇష్టం వుండదు. ఈ వ్యతిరేకతను పిల్లలు మరోరకంగా వ్యక్త పరచడానికి ప్రయత్నిస్తారు. పెద్దలు ఏంచెప్పినా ఎడ్డెం అంటే తెడ్డెం అనడం కన్పరుస్తారు. లేదా పూర్తిగా స్తబ్దుగా వుండిపోతారు. లేదా చెడు వ్యసనాలనాశ్రయిస్తారు.

టర్నింగ్ పాయింట్

మగధసైన్యం లక్షల సంఖ్యలో వుండగా, రథ, గజ, తురగాదులు విశేషంగా ఉన్నాయి. అలెగ్జాండర్ సైనికులు అప్పటికే పురుషోత్తముడి సైనిక పాటవాన్ని చవి చూసి వున్నారు. వారు మొదటిసారిగా ఏనుగులను చూసి అబ్బురపడి వున్నారు. ముందుకెడితే, అలెగ్జాండర్ గెలవగలడా?

వకుళాభరణం రామకృష్ణ

ఆ జగజ్జేత వెనుతిరగడం...

క్రీస్తు పూర్వకాలం నాటి చరిత్ర మొదలుకొని, ఇవ్వాల్టిదాకా, దేశాలనేలే రాజులు, చక్రవర్తులు, ప్రభుత్వాలు, రాజ్య విస్తరణకాంక్షతో దురాక్రమణ పూరిత విధానాలు అవలంభించారు. ఇతర దేశాలపై దండెత్తి, యుద్ధాలు చేసి, కొన్ని సార్లు సఫలులై, మరెన్నోసార్లు విఫలులై, చరిత్రలో విజేతలుగానో, పరాజితులుగానో మిగిలిపోయారు. అటువంటి ప్రపంచ విజేతలెందరో వున్నారు. రోమన్ చక్రవర్తి సీజర్, ఆ తర్వాత కాలంలో ఛార్లమెన్, తైమూర్, మరెందరో... మహాకవి శ్రీ శ్రీ అన్నట్టు...

చెంఘిజ్‌ఖాన్, తామర్లేనూ
నాదిర్షా, ఘజ్నీ, ఘోరీ
సికందరో ఎవ్వరైతేనేం
ఒక్కొక్కడూ మహాహంతకుడు

ఈ ప్రపంచ విజేతల్లో ప్రథముడు సికందర్‌గా పేర్గాంచిన అలెగ్జాండర్ గ్రీస్ దేశానికి ఉత్తరానవున్న మాసిడోనియా నుండి బయలుదేరాడు. కొమ్ములు తిరిగిన సైనికయోధులతో, పటిష్టమైన యుద్ధ సామాగ్రితో తయారై, దండయాత్రను ప్రారంభించాడు. అలెగ్జాండర్ సైనిక వ్యూహంలో ఆరితేరిన దిట్ట. ఎదురులేని యుద్ధవీరుడు. ప్రపంచ చరిత్రలో మిక్కిలిగా గ్లామర్ పొందిన చక్రవర్తి. అతడి పేరుతో ఎన్నో నగరాలు వెలిశాయి. నేటికీ ప్రాముఖ్యత సంతరించుకొన్న ఈజిప్టులోని "అలెగ్జాండ్రియా" పట్టణం అతడి పేరుపై ఏర్పడిందే.

అలెగ్జాండర్ మాసిడోనియా సింహాసనాన్ని అధిష్టించే నాటికి ఇరవయేళ్ళ నవయువకుడు. కీర్తి కోసం అర్రులు చాస్తూ, అత్యంత బలతరమైన పర్షియాను ఓడించాడు. ఈజిప్టును లొంగదీసుకొన్నాడు. ఆఫ్ఘనిస్తాన్, కాబూల్, హీరట్, సామర్‌ఖండ్‌లను ఆక్రమించుకున్నాడు. క్రీ.పూ. 326లో, భారతదేశంలోని సింధూనది ఎగువ భాగానికొచ్చి నిలిచాడు. భారత్ గడ్డపై అలెగ్జాండర్ కాలూనడమే గొప్ప చారిత్రక ఘటనగా పేర్కొనాల్సి వుంటుంది. ప్రపంచ చరిత్ర ఎట్లున్నా, భారతదేశ చరిత్ర మాత్రం తీవ్ర మార్పులకు గురైంది.

ఎలాగంటే ? - అలెగ్జాండర్, భారతదేశ సరిహద్దుల్లో వున్న అనేక బలిష్టమైన కొండజాతులను, గణరాజ్యాలను, చిన్న చిన్న జనపదాలను ఆక్రమించుకొంటూ వచ్చాడు. కానీ గట్టి ప్రతిఘటనను పోరస్ (గ్రీకు చరిత్ర కారులు రాసిన పేరు) అనే పురుషోత్తం నుండి ఎదుర్కొన్నాడు. పురుషోత్తముడు పొడగరి, బలిష్టుడు, సాహసవంతుడు. గొప్ప రాజుకుండాల్సిన ఠీవీ, దర్పం ఉన్నాయి.



స్ఫురద్రూపి. అయినా, అలెగ్జాండర్ ధాటికి నిలువలేకపోయాడు. సర్వశక్తులూ వొడ్డి ఎలాగైతేనేం పురుషోత్తముడిని ఓడించాడు అలెగ్జాండర్. పురుషోత్తముడి పరాక్రమానికి అలెగ్జాండర్ ముగ్ధుడయ్యాడు. రాజ్యాన్ని తిరిగి ఇచ్చి ఏలుకోమన్నాడు. పురుషోత్తముడిని ఓడించాక, గంగానదివైపు తన దండయాత్రను కొనసాగించాలనుకున్నాడు. కానీ ముందుకు వెళ్ళలేదు. వెనుదిరిగాడు. మాసిడోనియాకు తిరిగి వెడుతున్న అలెగ్జాండర్, మార్గమధ్యంలో, బాబిలోనియాలో 33 ఏండ్ల వయసులో, క్రీ.పూ. 323లో మరణించాడు.

అలెగ్జాండర్ వెనుదిరిగిపోవడంలో ఆంతర్యమేమయినా ? ఈ వెనుదిరగడమే ముఖ్యఘటన. దండయాత్ర కొనసాగించడానికి అలెగ్జాండర్ సైనికులు ఒప్పుకోలేదు. మొరాయించారు. దశాబ్దానికి పైగా సాగుతున్న యుద్ధకాండతో, వారు విసిగిపోయి, యుద్ధగ్లానికి లోనయ్యారు. ఈ కారణాన్నే అనేక మంది చరిత్రకారులు, అలెగ్జాండర్ వెనుతిరగడానికి దోహదం చేసిందని పేర్కొన్నారు. ఆది నిజమా ? కాకుంటే, మరేమైనా కారణాలున్నాయా ? అలెగ్జాండర్ ముందుకుపోయివుంటే, భారతదేశానికి గుండెకాయగా చెప్పదగిన గంగా-సింధూ మైదానంలో "మగధరాజ్యం" వుంది. నంద వంశపు రాజుల్లో ముఖ్యుడు, అత్యంత బలవంతుడైన మహా పద్మనందుడు రాజ్యమేలుతున్నాడు. పాటలీపుత్రం దాని రాజధాని. సైన్యం లక్షల సంఖ్యలో వుండగా, రథ, గజ, తురగాదులు విశేషంగా ఉన్నాయి. అలెగ్జాండర్ సైనికులు అప్పటికే పురుషోత్తముడి సైనిక పాటవాన్ని చవి చూసి వున్నారు. వారు మొదటిసారిగా ఏనుగులను చూసి అబ్బురపడి వున్నారు. ముందుకెడితే, అలెగ్జాండర్ గెలవగలడా? సందేహం. అదీగాక, ఈ దండయాత్ర సందర్భంగానే, నందరాజ్యాన్ని ఓడింప ప్రయత్నిస్తున్న చంద్రగుప్తమౌర్యుడు అలెగ్జాండర్‌ను కలిసాడు. సామ్రాజ్య నిర్మాణానికి కావాల్సిన ఉత్తేజాన్ని, ప్రభావాన్ని పొందాడు కూడా. అలెగ్జాండర్ దీనిని ప్రోత్సహించాడు. అంతేకాదు. అనేక చిన్న, చిన్న రాజ్యాలను బలవత్తరమైన అటవీ రాజ్యాలను ఆక్రమించడం ద్వారా ఆ తర్వాత సువిశాల సామ్రాజ్య నిర్మాణానికి అలెగ్జాండర్ దండయాత్ర దోహదం చేసింది.

ఇక్కడే చరిత్ర మలుపు తిరిగి, భారతదేశంలో మొట్టమొదటి సామ్రాజ్యం-మౌర్య సామ్రాజ్యం-చంద్రగుప్తుడి అధీనంలో, చాణిక్యుడని పేర్గాంచిన కౌటిల్యుడి మంత్రాంగంలో ఏర్పడింది. అదే ఆనాటి జగజ్జేత అలెగ్జాండర్ వెనుదిరగకపోతే...!

గవర్నర్ ఆర్డరేసినా...

నేను అనంతపురం జిల్లా ముదిగుబ్బ మండల వాస్తవ్యుణ్ని. కోటిరెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో 18.12.95 నుండి గుమస్తాగా పనిచేశాను. 29.5.03లో నన్ను తొలగించినట్లు ప్రకటన జారీ చేశారు. ముందుగా ఎటువంటి నోటీసూ ఇవ్వలేదు. దీన్ని సవాలు చేస్తూ మేం హైకోర్టునాశ్రయించాం. తిరిగి సంఘంలో చేర్చుకోవలసిందిగా హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. సదరు ఉత్తర్వులను తీసుకొని మేం అధికారుల దగ్గరకెళ్లాం. వారు మమ్మల్ని విధుల్లోకి తీసుకోలేదు. కొన్ని రోజుల తర్వాత గవర్నరు ఈ ఉత్తర్వుపై ఆర్డినెన్సు జారీ చేశారు. పని చేసిన రోజుల వేతనాన్ని మాకివ్వలేదు. సలహా ఇవ్వగలరు.

కె. చెన్నకేశవ రెడ్డి, నల్లమడ మండలం,రెడ్డిపల్లి.




జి.ఎల్.నరసింహారావు,
హైకోర్టు న్యాయవాది

మంచితనంగా అడిగి చూడండి

సార్ మా అన్న ఎస్సీ కార్పొరేషనులో కన్సాలిడేటెడ్ డ్రైవరుగా పనిచేశాడు. అకాల మరణం పొందాడు. అతని కుటుంబ సభ్యులలో ఎవరికైనా ఎన్.ఎం.ఆర్ డేలీవైజ్‌గా ఉద్యోగమొస్తుందా? జి.ఒ.ఎం.ఎస్. 118 ప్రకారం ఉద్యోగమొచ్చే అవకాశముందా? దీనిపై కోర్టుకు పిటిషన్స్ ఏ విధంగా పెట్టుకోవచ్చో తెలుపగలరు.

బి. వెంకన్న, గండమళ్ళ రాములు
రహమత్‌నగర్, శ్రీనివాస్ కాలనీ, నల్గొండ

నోటీసివ్వకుండా మిమ్మల్ని తీసివేయడం తప్పని హైకోర్టు తీర్పు చెప్పి ఉంటుంది. గవర్నర్ ఆదేశంతో ఉద్యోగాలు తీసివేసినా మీ పని చేసిన రోజులకు గాని అధికారులకు అర్జి పెట్టి వారు స్పందించనట్లయితే మరల హైకోర్టులో కేసు వేసుకొని పొందవచ్చును.

మీ అన్నగారి ఉద్యోగం పర్మినెంట్ కాదు. ఎస్.సి కార్పోరేషన్‌లో కన్సాలిడేటెడ్ డ్రైవర్ చేశాడని మీరే రాశారు. అలాంటిది అతడి మరణంతో 'కంపాన్సియేటివ్'గా ఇంకో కుటుంబ సభ్యునికి ఇవ్వడం కుదరదు. హైకోర్టు ద్వారా గానీ, న్యాయ పరంగా గానీ సాధ్యం కాదు. ఇలా కాకుండా మంచితనంతో ఆలోచించమని కోరుతూ ఓ సారి అధికారులను కలిసి చూడండి.

'నాన్నా...! చనిపోయావా ?"

రోడ్డు మీద యాక్సిడెంట్ జరిగింది. జనం గుమిగూడారు. అప్పడే అక్కడికి వచ్చిన నవీన్‌కు యాక్సిడెంట్ ఎవరికి జరిగిందో చూడాలనిపించింది. గుంపు ఎక్కువగా ఉండడంతో వీలు కుదరడం లేదు. టక్కున ఓ ఉపాయం తోచింది. " నాన్నా! చనిపోయావా ?" అంటూ ఏడుస్తూ జనాన్ని తప్పకుంటూ ముందుకు వెళ్లాడు. అక్కడొక గాడిద చచ్చి పడి ఉంది.

- పెండెం జగదీశ్వర్



"ఇంట్లో వస్తువులుండాలి"అని అనుకోగానే సరిపోదు. వాటికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే అవి కొన్నాళ్లు మనకుపయోగపడతాయి.

పి. జ్యోతి

"గ్లాస్ సెట్... చేజారితే ఫట్"

"ఓ రేయ్! చింటూ! డిన్నర్ సెట్‌లోని బౌల్ కిందపడి బద్ధలై పోయిందిరా"అంటున్న చిన్ని గొంతు భయంతో వణికిపోతోంది.

"పోతే పోయిందిలే వెధవ బౌల్ మళ్లీ కొనుక్కోవచ్చు. అలా వణికి ఛస్తావేం. మమ్మీకి నేను చెబుతాలే... నిన్నేం అనొద్దని" అన్నాడు చింటూగాడు పెద్ద ఆరిందాలా అక్కతో.

"అదే, నువ్వు పడేస్తే తెలిసేది. మొన్న గ్లాస్ సెట్టులోంచి ఓ గ్లాస్ పగలగొట్టి... మమ్మీ తిడుతుందనే భయంతో నీ నిక్కర్ తడిపేసుకున్నావుగా?"

"ఛాల్లేవే... ఎప్పటెప్పటివో గుర్తు చేసుకొని మరీ చెప్పాలా? ఏదో వణికి ఛస్తున్నావని కాస్త ధైర్యం చెప్పానంతే! ఒద్దయితే మానెయ్" అనరిచాడు గట్టిగా.

వీరి కేకలకు వంటింట్లోంచి బయటి కొచ్చింది నళిని.

"ఏంటీ! ఏం జరిగిందీ! అయ్యో ఇదేవిటి? ఈ గాజు ముక్కలన్నీ ఇలా వడున్నాయ్ం'' కింద వడున్న గాజుముక్కలను చూస్తూ అంది నళిని.

"మమ్మీ! నేను కాదే! అదిగో అదే పడేసింది'' అంటూ చింటూగాడు సంబరపడిపోతూ రిపోర్టిచ్చాడు.

"మమ్మీ! గ్రేప్స్ బౌల్‌లో పెడుతుంటే చేయిజారింది. కావాలని పడేయలేదు. నిజ్జంగా..."

''అబ్బబ్బ! మీతో వేగలేక ఛస్తున్నా... గాజు వస్తువులందంగా ఉంటాయని ఎంతో ముచ్చటపడి కొంటే... ఇద్దరూ కలిసి ఒక్కొక్కటీ బద్ధలు కొట్టేస్తున్నారు" పిల్లల మీద నళిని అరుస్తుండగా స్నేహితురాలు గౌతమి వచ్చింది.

"ఏవిటే! నళినీ! పిల్లల మీద అరుస్తున్నావ్?" ప్రశ్నించింది గౌతమి.

"ఏం చెప్పమంటావే బాబూ... వీళ్ల గొడవ. ఇల్లుపీకి పందిరేస్తున్నారు. ఒక్కరోజు సెలవొస్తే... వీళ్ల అల్లరి భరించడం నాకు గగనమై పోతోందే. మనం మొన్న బజారుకెళ్లినప్పుడు నేనెంతో ఇష్టంగా తెచ్చుకున్నానే... డైనింగ్ సెట్ గ్లాస్ వేర్. దాంట్లోంచి రోజుకొకటి చొప్పున వంతులు పెట్టుకొని మరీ పగలగొట్టేస్తున్నారు. బాబోయ్! ఎలా వేగాలో వీళ్లతో" అంటూ తన బాధను వ్యక్తం చేసింది నళిని.

"నళినీ! చిన్న పిల్లలన్నపుడు

ఇలాంటివి సహజవేమే! దానికింత రాద్ధాంతమెందుకే...? అయినా నువ్వు గాజు సామాన్లెందుక్కొంటావ్? కిందపడ్డా పగలని (అన్ బ్రేకబుల్) వస్తువులు కొను. వాటితో ఇలాంటి సమస్యుండదు కదా..."

గౌతమి అన్నది వాస్తవమే. ఉరుకుల పరుగుల జీవితానికి ప్లాస్టిక్ సెట్టయితే సరిపోతుంది. చూడటానికి గాజు వాటిలా మెరుస్తుంటాయి.

మన ఇంట్లో డైనింగ్ రూం ప్రత్యేకంగా లేకపోయినా, వంటగది విశాలంగా ఉంటే అక్కడే డైనింగ్ టేబుల్ వేసుకోవచ్చు. టేబుల్ చదరంగా ఉన్నట్లయితే... వండిన పదార్థాలన్నీ పెట్టుకోవడానికీ, అందరూ కూర్చుని తినడానికీ వీలుగా ఉంటుంది. డైనింగ్ టేబులుకు దగ్గరగా ఒక అల్మారా ఉండేలా అమర్చుకుంటే కావలసిన పచ్చళ్లు, పొడులు, చిన్న గిన్నెలు, స్పూన్స్, ఫోర్క్స్ లాంటివి పెట్టుకోవచ్చు.

వండిన పదార్థాలన్నీ నీట్‌గా ఒకే రకమైన సెట్టులో సర్దాలి. అప్పుడే చూడటానికందంగా ఉంటుంది. ఇంటికెవరైనా అతిథులొచ్చినా వడ్డించటానికి వీలుగానూ ఉంటుంది.

కుర్చీలన్నింటిపైన నాప్‌కిన్స్ ఉంచితే... భోజనం కాగానే చేతులు తుడుచుకోవడానికి నాపికిన్ కోసం ఎవరూ వెతుక్కునే పనుండదు.

డైనింగ్ టేబుల్‌పై ఉంచే గిన్నెలు, పళ్లాల కింద మ్యాట్స్ వేయాలి. దీని వల్ల టేబిల్‌పై గీతలు పడవు. టేబులును ప్రతిరోజూ సబ్బునీటితో శుభ్రంగా తుడవాలి. చిన్న గిన్నెలో పుదీనా ఆకులు వేసి టేబుల్‌పై ఉంచితే ఈగలు వాలవు.

"ఇంట్లో వస్తువులుండాలి"అని అనుకోగానే సరిపోదు. వాటికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే అవి కొన్నాళ్లు మనకుపయోగపడతాయి.

నేర్చుకుందాం...రా!

రంగులకు గుణముంది

సండే డెస్క్

మీరు నైట్ పార్టీలకు హాజరవబోతున్నారా? ఏ డ్రెస్ వేసుకోవాలో తేల్చుకోలేకపోతున్నారా?

ఎటువంటి సందేహమూ లేకుండా స్మూత్ కలర్ దుస్తులనే ఎంపిక చేసుకోండి. ఇవేం కలర్సా అని ఆశ్చర్యపోతున్నారా? స్మూత్ కలర్సంటే కంటికి నొప్పికలిగించకుండా ఉండే రంగులు. ఈ రంగులను ఉదయం, సాయంత్రం వేళల్లో, ముఖ్యంగా రాత్రి వేళల్లో జరిగే పార్టీలకు హాజరయ్యేటప్పుడు వాడితే చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. ఆకుపచ్చ, నీలి, తెలుపు తదితర రంగులన్నీ కోల్డ్ కలర్స్‌గా భావించొచ్చు. ఈ స్మూత్ కలర్స్‌లో నీలి రంగును, దీని తాలూకు కాంబినేషన్ కలర్లను రాత్రివేళ వాడితే... ఆ బట్టలు ధరించిన వ్యక్తి పట్ల ప్రత్యేక ఆకర్షణ కలిగేలా చేస్తాయి.

పసుపు, నారింజ, ఎరుపు, నలుపు రంగులను వార్మ్ కలర్సంటారు. ఈ ముదురు రంగులను, వాటి తాలూకు మిశ్రమ రంగులను పగటిపూట వాడడం మంచిది.

రంగులను సందర్భోచితంగా వాడడమెలా?

ఈ విషయం డ్రెస్ డిజైనర్లకు, ఫ్యాబ్రిక్ పెయింటర్లకే కాదు డ్రస్‌సెన్స్ తెలిసిన ప్రతి ఒక్కరికీ కలర్ సెన్సుండి తీరాలి. ఈ రంగులను బ్యాలన్సింగ్‌గా ఎలా వాడాలో అందరికీ తెలిసుండాలి.

ప్రతి రంగుకూ ఓ ప్రత్యేకతుంటుంది. ఒక్కో రంగు ఒక్కోకోణంలో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఒక్కో సందర్భంలో ఒక్కో రంగు ఎంతో అందంగా కనిపిస్తుంది.

కలర్‌సెన్స్ తెలియనప్పుడు కొన్ని సందర్భాలలో ఇతరులు మనలను చూసి నవ్వుకోవచ్చు. అందమైన వ్యక్తులను సరైన బట్టలు, రంగులు మరింత ఆకర్షణీయంగా కనిపించేలా చేస్తాయి. సరైన బట్టలు హుందాతనాన్ని, అందాన్ని ఇస్తాయి. కాబట్టి సమయం సందర్భాలకు తగినట్టుగా బట్టలను ధరించాలి. ఆ బట్టల మీద డిజైన్ పెయింట్ చేయదలచుకుంటే సరైన కలర్ కాంబినేషన్ మీకు తెలిసుండాలి.

కలర్ బ్యాలెన్సింగెలా?

ఎరుపురంగు...మన చూపును చటుక్కున తన వైపు తిప్పుకుంటుంది. ఇలా చూపును లాగేసే రంగులలో ఎరుపు తర్వాతి స్థానం నీలి, పసుపురంగులది.

మీరు బట్ట మీద పెయింట్ చేసేప్పుడు లేదా థ్రెడ్ ఎంబ్రాయిడరీ చేసినప్పుడు రంగుల తాలూకు ప్రాధాన్యతను, వాటి గుణగణాలను మనసులో ఉంచుకోవాలి. కలర్ కాంబినేషన్‌లో రంగుల మధ్య సమతుల్యస్థితి వచ్చేలా చూసుకోవాలి. ఉదాహరణకు బట్టకు ఓ వైపు మీరు ఎరుపు రంగు వాడారనుకోండి... చూపరుల దృష్టి ఆ వైపున నిలిచిపోతుంది. అలాకాక బట్ట పూర్తిగా ఇతరులను ఆకర్షించేలా చేయాలంటే, ఒ వైపు ఎరుపు రంగున్నప్పుడు, మరోవైపు ఆ రంగుకు ఇంచుమించు సమాన ప్రాధాన్యత, గుణగణాలున్న రంగును వాడవలసుంటుంది.

వచ్చే వారం కలర్ బ్యాలెన్సింగెలా చేయాలో తెలుసుకుందాం...

మన సుత్తి

గురునాథానికి సుత్తి అవసరమొచ్చింది. కొడుకు రవిని పక్కింటి పాపారావు దగ్గరకు పంపాడు పాపారావు లేదని చెప్పాడు. ఎదురింట్లో ఉండే ఎల్లారెడ్డిని అడిగాడు రవి. ఆయనా లేదన్నాడు. వెనకింట్లో వెంగళ్‌రావును కూడా అడిగాడు. ఆయన ఇవ్వనన్నాడు. రవి గురునాథంతో" ఎవరూ సుత్తి ఇవ్వడం లేదు నాన్నా" అని చెప్పాడు తిరిగొచ్చాక.

అప్పుడు గురునాథం కోపంగా "మన దేశంలో స్వార్థపరులు ఎక్కువై పోతున్నారు. ఇంట్లోకి వెళ్లి మన సుత్తి తీసుకురాపో" అన్నాడు

- పెండెం జగదీశ్వర్

సీరియల్

మాధవి

మూలం : అనుపమా నిరంజన

అనుసరణ : వి. నాగరత్న

గతవారం కథలో...

గురుదక్షిణ కోసం గాలవుడు, పుత్రుడికోసం దివోదాసు మాధవిని ఒక వస్తువుగా భావించినా పరిచారిక మేఖల, మహారాణి సత్యవతి తననొక మహిళగా, మాతృహృదయిగా ఊరడింపజేశారు. మహారాణి వనవిహారం కూడా ఏర్పాటుచేయించింది. ఇప్పుడు పుట్టబోయే బిడ్డను కూడా వదిలి గాలవుడి వెంట కుక్కపిల్లలా పోకతప్పదు అనే విచారం మాధవిని వెన్నంటే ఉంది. పారిపోదామనుకున్నా మహారాజు వదిలిపెట్టడని, మహారాణి కూడా ఇబ్బందులు పాలవుతుందని అనుకుంది. ఇన్ని విచారాలతో నిండుగర్భిణిగా రోజులు వెళ్ళబుచ్చింది మాధవి.

(19వ భాగం)

మాధవికి నెలలు నిండి చక్కటి మగబిడ్డను కన్నది. సత్యవతి ఎలాంటి అసూయ పడకుండా ఆనందంగా అందరికీ తీపి పదార్థం పంచిపెట్టింది.

ఇక దివోదాను ఆనందానికి అవధుల్లేకపోయాయి. తాను చేసిన పుత్రకామేష్టి ఫలించిందని మురిసిపోయాడు. రాజదర్బారులో అందరికీ సముచిత కానుకలిచ్చాడు. రాజపురోహితుడు “రాజా, నీకు చాలా తెలివైన కొడుకు పుట్టాడు. శత్రురాజులతో యుద్ధంచేసి గెలుస్తాడు. నీకెంతో కీర్తి తెచ్చిపెడతాడు, చూస్తుండు. బాబుకు ‘ప్రతర్దనుడు’ అని పేరు పెట్టు” అన్నాడు. రాజు సంతోషంగా ఒప్పుకున్నాడు. బ్రాహ్మణులను పిలిపించి, ఘనంగా దక్షిణ సమర్పించి, శుభసూచికంగా పూజలు చేయించాడు. పూజానంతరం వారు ‘కీర్తిప్రతిష్ఠలు ఆర్జించి, దీర్ఘాయుష్షుతో వర్ధిల్లాల’ని దీవించివెళ్ళారు.

మాధవి ‘వీడితో ఎన్నిరోజులు వుంటానో?! ఆనక వదిలి వెళ్ళాల్సిందే కదా’ అనుకుని బాధపడుతోంది. ‘నా జీవితంలో ఇంత శోకమేంటి, నేనేం పాపం చేశాను?’ అని కణతలు నొక్కుకుంటూ శూన్యంలోకి చూస్తోంది. అలా కొద్దిరోజులు చంటిబిడ్డ మాధవి పక్కలో వున్నాడు. గడిచిన రాత్రి సరిగా నిద్ర లేకపోవడాన పగటిపూట నిద్రపట్టింది మాధవికి. పాలిచ్చేవేళకి కళ్ళు తెరవకుండానే కొడుకుకోసం తడిమి, వాడు లేకపోయేసరికి ఉలిక్కిపడింది. పొరపాటున కిందపడిపోయాడేమోనని కిందచూస్తే అక్కడా లేదు. భయంతో కంపించిపోయి “మేఖలా” అంటూ కేకలుపెట్టింది.

మేఖల వచ్చి “బాబుని సత్యవతిగారు తీసుకున్నారు మాధవీ... ఇకపై వాడి ఆలనాపాలనా ఆవిడే చూసుకుంటారట” అంటూ అసలు విషయం చెప్పింది.

మాధవి కళ్ళు తేలేసి, “పాలకోసం ఏడుస్తాడు, ఒకసారి తీసుకురా” అంది.

“ఇక నీ పాలు మాన్పించి పోతపాలు పట్టడం మంచిదని అలా చేశారావిడ. కాస్త ఊహ తెలిస్తే ఆ పాలు తాగనని మొరాయిస్తాడేమోనని.. ఇకనుంచీ బాబు ఆలనాపాలనా కూడా తానే చూస్తానన్నారు సత్యవతిగారు. ఇప్పట్నుంచే అలవాటు చేస్తే నువ్వు వెళ్ళిపోయాక్కూడా బెంగపెట్టుకోడని...” అంటూ మేఖల చెబుతుంటే మాధవి కళ్ళెమ్మట ధారలు కారాయి.

అది చూసిన మేఖలకూ దుఃఖం పొంగుకురాగా “మాధవీ, నీముందు ఏడవకూడదని ఎంత గట్టిగా నిర్ణయించుకున్నా నావల్ల కావడంలేదు. ఎంతైనా గాంభీర్యం తెలీని మామూలు మనిషిని కదా”



“నల్లరంగు చెవి ఉన్న తెల్లటి గుర్రాలు ఎనిమిది వందలు నాకు గురుదక్షిణగా కావాలి” అన్న గురువు గారి కోరికను ఆ శిష్యుడెలా తీర్చాడో ఈ సీరియల్‌లో చదువుతున్నారు.

అంది.

"ఇక్కణ్ణించి వెళ్ళాక ఎలానూ నా బాబును చూడలేను, ఇప్పుడు కూడా దూరం చేయడం ఎంత దారుణం మేఖలా?!" అంది మాధవి.

"అది రాజుగారి ఆజ్ఞమ్మా, నువ్వెళ్ళాక ప్రతర్దనుడు ఎంతమాత్రం బెంగపెట్టుకోకూడదని, ఇప్పట్నించే ఈ జాగ్రత్తలు తీసుకోమని పురమాయించారు"

"నువ్వెళ్ళి బాబును తీసుకురా మేఖలా" అంది స్థిరచిత్తంతో.

వెళ్ళిన మేఖల రాలేదు కానీ సత్యవతి వచ్చి "నువ్వు చాలా అలసటగా వున్నావు మాధవీ, వాడిని నా దగ్గరుండనీ... నేను వాడికి ఏ లోటూ రాకుండా చూసుకుంటానుగా, నువ్వు నిశ్చింతగా వుండు" అంది.

"నేనేం అలసటగా లేను అక్కయ్యా, రాత్రి నిద్ర లేనందున కాస్త కునుకు పట్టిందంతే. చెట్టుకు కాయ భారమౌతుందా, నువ్వే చెప్పు" అంది ఆర్ద్రంగా.

మహారాణి కరిగిపోయినా ఎక్కువతక్కువ మాట్లాడతలచుకోలేదు. మాధవి పరిస్థితి దయనీయమని తెలిసినా దివోదాసు చెప్పిందానికి వ్యతిరేకంగా నడచుకుంటే ఆయనగారి కోపోద్రేకాలకు బలికావలసివస్తుందని వెరచి మౌనంగా చూసింది.

సత్యవతి ఏమీ మాట్లాడకపోవడంతో "అక్కయ్యా, రేపు బిడ్డను వదిలివెళ్ళాక ఎటూ ఎడబాటు తప్పదు. ఇక్కడుండగానే విడదీస్తారా మమ్మల్ని?!" అనడిగింది మాధవి మళ్ళీ.

బయట నిలబడ్డ మేఖలను ఉద్దేశించి "బాబునోసారి తీసుకురా" అంది సత్యవతి.

సత్యవతి స్వరం బాగా తగ్గించి "మాధవీ, ప్రతర్దనుణ్ణి వీలైనంతవరకూ నన్నే చూసుకోమన్నారు రాజుగారు... ఆయన మాటను ధిక్కరించగలనా, నువ్వే చెప్పు?!" అంది.

మాధవి కన్నీళ్ళతో రాణి చేతులను స్పృశిస్తూ "వాడెటూ నాతో రాలేడు... ఏడుస్తున్నాడనో మరేదో చెప్పి నా దగ్గరే వుండేలా చూడక్కయ్యా" అంది.

సత్యవతి అలాగేనని తల పంకించి భారమైన మనసుతో అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

మేఖల బాబును జాగ్రత్తగా తీసుకొచ్చి మాధవి ఒడిలో వుంచడంతో ఒళ్ళంతా తడిమి ముద్దులు పెట్టింది.

"మాధవీ! నువ్వు గాలవుడితో వెళ్ళకుండా ఇక్కడే వుండిపోవచ్చుగా"

"నాకు అంత అదృష్టం లేదు మేఖలా. నాదైన చోటు ఎక్కడా రాసిపెట్టిలేదు" విచారంగా అంది మాధవి.

కొద్దిసేపు మాధవితో అవీఇవీ మాట్లాడి పూలు కోసేందుకు వెళ్ళింది మేఖల.

మరి కాసేపటికి దివోదాసు వచ్చి కొద్దిదూరంలో నిలబడిపోయాడు.

బాబును అపురూపంగా చెక్కిలికానించుకుని ముద్దాడుతున్న మాధవిని చూసి ముగ్ధుడయ్యాడు.

నీడ వెందిలినట్లయి ఉలిక్కిపడి చూసిన మాధవి కొంచెం గాబరాచెంది "ఇప్పుడే బాబుని తెప్పించుకున్నాను" అంది.

అతడి మాటను నిర్లక్ష్యం చేసినందుకు తననే కోప్పడతాడో లేక మహారాణిపై కోపగించుకుంటాడోనని మనసులో భయపడింది.

కానీ రాజు అందుకు భిన్నంగా "కన్నకొడుకుపై నీకు మమకారం లేకుండా ఎలా వుంటుంది, ఆమాత్రం నేను అర్థంచేసుకోగలను మాధవీ... కాకపోతే తల్లిబెంగ సామాన్యమైంది కాదు. నీ స్పర్శ, నువ్వు చూపే ప్రేమలకు అలవాటుపడితే రేపు నువ్వెళ్ళిపోయాక వాడు బెంగతో పాలు తాగకుండా ఏడిస్తే ఏం చేయాలి చెప్పు?! అందుకే ఇప్పట్నుంచే ఇతర్ల దగ్గర అలవాటైతే నిన్ను తేలిగ్గా మర్చిపోయి మామూలుగా వుంటాడని అలా చేశాను. సత్య కూడా చాలా మంచిది, తన కొడుకే అన్నంత ఇష్టంగా దగ్గరుంచుకుంటోంది" అన్నాడు.

'కొడుకు గురించి బాగానే ఆలోచించావు కానీ మరి నా మాటేంటి? తల్లికి కన్నబిడ్డపై బెంగుండదా? ఇన్నాళ్ళు కాపురం చేశాడుగానీ ఒక్క క్షణం కూడా తన గురించి ఆలోచించడా?' అనుకోగానే మనసులో అగ్నిజ్వాల రగిలింది.

"మాట్లాడవే మాధవీ, నేనన్నదాంట్లో నిజంలేదా? సరే కానీ ప్రతర్దనుణ్ణి ఉయ్యాల్లో పడుకోబెట్టు, నీతో కాసేపు గడపాలని వచ్చాను'' అంటూ ఆమె మెడపై చుంబించాడు.

"బాబిప్పుడు పాలు తాగే సమయం... లేకుంటే వాడు ఏడుస్తాడు'' అని బదులిచ్చి "మేఖలా, ఎక్కడున్నావు?" అంటూ హెచ్చుస్వరంతో పిలిచింది.

మేఖల దూరంనుంచే "వస్తున్నాను.. ఒక్క నిమిషం" అంటూ బదులిచ్చింది.

"బిడ్డకు ఏ పాలు..?" తెల్చుకోవడంకోసం అడిగాడు.

"భయపడకండి, నా పాలివ్వడంలేదు, మీరు ఆవుపాలే అలవాటు చేయమన్నారని అక్కయ్య చెప్పింది" రోషం బుసలు కొట్టగా వత్తి పలుకుతూ అంది మాధవి.

దివోదాసు తృప్తిగా తల పంకించి "అన్నట్లు గాలవుడికి కబురు చేశాను మాధవీ, వచ్చే నెల అంటే ఫాల్గుణంలో వస్తాడట. ఆ మునికి నేను చాలా రుణపడివుంటాను. పోతే.. నువ్వు నాకు కొడుకును కనిచ్చి మహోపకారం చేశావు, అందుకు ప్రతిఫలం ఏం కావాలో చెప్పు.. కాదనకుండా తీరుస్తాను" అన్నాడు.

'నన్ను నా కొడుకుతోనే వుండనివ్వు' అనాలనిపించినా, అదెటూ నిష్ప్రయోజనమైన కోరిక కనుక "ఏమీ లేదు, బాబును ప్రేమగా చూసుకుంటే అంతే చాలు" అంది.

"అది నువ్వు వేరే చెప్పాలా, వాడిని నా ప్రాణంకంటే ఎక్కువగా చూసుకుంటాను" అన్నాడు.

మాధవి ఇంకేం మాట్లాడకపోవడంతో ఇక అక్కడుండటం ఇష్టంలేక మళ్ళీ వస్తానని బయల్దేరాడు.

* ***

దూతతో చెప్పి పంపినట్లుగా ఫాల్గుణమాసంలో గాలవుడు రానే వచ్చాడు. ఐదడుగుల ఎత్తున్న ఆ బక్కపల్చటి ఆకారాన్ని చూడగానే 'ఇతడికి ఏ రాచపుండో వచ్చి చావకూడదా?' అనుకుంది మాధవి.

'అబ్బ.. ఇద్దరు పిల్లల్ని కని కూడా ఎంత నేవళంగా వుంది? నిజంగా మాధవిది దివ్య తేజస్సు' అని మనసులో అనుకుని పైకి "ఎలా వున్నావు మాధవీ?" అన్నాడు గాలవుడు.

"తమరి దయవల్ల ఇంకా బ్రతికే వున్నాను"

"నాపై కొంచెం కోపమొచ్చినట్లుంది.. ఇంతకీ ఆరోగ్యమెలా వుంది? నడవగలవా?"

అప్పుడే అక్కడికొచ్చిన దివోదాసు "ఉహూ, మాధవిని నడిపించొద్దు.. మీరెక్కడికి వెళ్ళాలో చెప్తే రథం ఏర్పాటు చేస్తాను" అన్నాడు.

"అక్కర్లేదు రాజా, ఈ ఒంట్లో ఇంకా బలముంది" అంది మాధవి.

"నిజమే రాజా, మేం నడిచివెళ్ళడమే మంచిది. ఇస్తానన్న గుర్రాలను మాత్రం మీ దగ్గరే వుండనివ్వండి, నేను అడిగినప్పుడు పంపిద్దురుగాని" అన్నాడు గాలవుడు.

మేఖల, ఇతర దాసీజనం అందరూ ఏడ్పులతో వీడ్కోలు చెప్పారు. సత్యవతి ఎంత గాంభీర్యాన్ని తెచ్చిపెట్టుకున్నా మనసునిండా విషాదం అలముకుంది.

... ఇంకా ఉంది

ఇప్పటికి ఇద్దరు బిడ్డల్ని పోగొట్టుకున్న మాధవి ఇంకెంతమందిని కోల్పోవాలి?

ఇలా ఒక్కో రాజుకు తార్చేవాడు మునీశ్వరుడెట్లా అవుతాడు, ఇది తగదని గాలవుడుకి ఎవ్వరూ చెప్పరా?

దివోదాసు రాజ్యంనుంచి బయలుదేరి మళ్లీ ఇంకెవరివద్దకు తీసుకెళతాడు?

వచ్చే సంచికలో...

క్యాంపస్ ఛాట్

క్రికెట్ మ్యాచ్ రిలే అవుతున్న టీవీ ముందు మనల్ని కట్టిపడేసిన క్రికెటర్లేమో... రన్నుల మీద రన్నులు తీస్తూ తమ స్కోరు పెంచుకుంటున్నారు. దానితో పాటు రాబడీ పెంచుకుంటున్నారు. మరి మనమో...

కె. శివలీల

చదువా... క్రికెట్టా...

ఎటుచూసినా హాస్టలర్సే... సినిమాలకు, షికార్లకు చెక్కేసేవారు కొందరైతే... గదిలోనే కూర్చుని రూమ్మేట్‌లతో బాతాఖానీ కొట్టేవారు మరి కొందరు. కొందరు లైబ్రరీకి అంకితమైపోతే... ఇంకొందరు వారం నుంచి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేసుకోవడంలో నిమగ్నమయ్యారు. క్యాంపస్ వాతావరణమెందుకింత సందడిగా ఉంది? కారణమేంటంటే అది ఆదివారం.

మరి వీరంతా ఈరోజేమయ్యారు? వీరి అల్లరేమయింది? ఎటుచూసినా... నిశ్శబ్దం తాండవిస్తోందెందుకు? నిర్మానుష్యంగా ఉన్నరోడ్లు... దారిపొడుగునా నిటారుగా ఉన్న చెట్లు... వాటి కింద చదువుకుంటున్న ఒకరిద్దరు తప్ప కనుచూపుమేరలో మనుషుల జాడే లేదు. ఆదివారం హాస్టల్ వాతావరణమింత నిశ్శబ్దంగానా... కారణమేమై ఉండొచ్చంటారు? ఏదైనా స్ట్రయిక్ చేస్తున్నారేమో... లేకపోతే అందరూ కలసి పిక్నిక్‌కు వెళ్లారా? సెమిస్టర్ ఎగ్జామ్స్ టైంలోనా? నో ఛాన్స్! మరి... వీరంతా ఇలా మూకుమ్మడిగా బయటికి రాకపోవడానికి కారణం...

హుషారుగా కేరింతలు కొట్టే కుర్రకారునిలా హాస్టల్‌లోనే కట్టివడేసే మహాత్యమిక దేనికుంటుంది..... ఒక్క క్రికెట్ మ్యాచ్‌కు తప్ప. దీనిపై విద్యార్థుల భావనలెలా ఉన్నాయో తెలుసుకోవాలనుందా... ఇంకెందుకాలస్యం.

"క్రికెట్ మ్యాచ్ ఉందంటే చాలు... ఇక మా హాస్టల్ సంగతి చెప్పక్కర్లేదు... టీవీ రూంలో అందరూ ముందే స్థలాలను రిజర్వ్ చేసుకుంటారు. ఫోరో... సిక్సరో కొడితే తప్పట్లు... కేకలు మామూలే. సింగిల్ రన్ చేసినా హోరున కేకలేస్తారు... గట్టిగా చప్పట్లు కొడతారు. ఎందుకనడిగితే... 'ఇలాంటి క్రిటికల్ పొజిషన్‌లో సింగిల్ రన్ చేయడమే గ్రేట్... వాళ్లను మనం ఆ మాత్రం ప్రోత్సహించకపోతే ఎలా?' అని ఎదురు ప్రశ్నిస్తారు. ఏదో వీళ్లంతా స్టేడియంలో ఉన్నట్లూ... వీళ్ల కేకలూ అరుపులూ వాళ్లకు వినబడి ఎంతో ఆత్మవిశ్వాసాన్నిచ్చినట్లూ..." అంటూ తన అభిప్రాయాన్ని చెప్పింది అను.



"నేను పీజీ ఫస్టియర్ చదువుతున్నాను. మాకు ఇంటర్నల్ ఎగ్జామ్స్ మొదలయ్యాయి. టీవీలో క్రికెట్ మ్యాచ్ వస్తోంది. నేను రూంలో చదువుకుంటున్నాను. చదువుకుందామన్నా... వాళ్ల అరుపులకు ఏకాగ్రత కుదరట్లేదు. నిమిషనిమిషానికీ నాలో ఉత్కంఠత పెరిగిపోతోంది. టీవీ రూంలోకి ఎంటరయ్యా.. కిక్కిరిసిన ఆ గదిలో... ఎలాగోలా స్థలాన్ని సంపాదించి కూర్చున్నా. ఇండియన్స్ ఒక్క రన్ చేస్తే చాలు... మా వాళ్లంతా గట్టిగా కేకలు... అరుపులు... చప్పట్లు... ఇక ఫోర్ కొడితే ఎలా ఉంటుందో ఊహించుకోండి. అరగంట గడిచింది... నాకు తలనొప్పి మొదలైంది. మ్యాచ్ మీద క్రమంగా ఆసక్తి తగ్గిపోతోంది. నేను ముభావంగా ఉండడం చూసి నా రూమ్మేట్ 'నువ్వూ మాలా అరిస్తే తప్ప... నీ తలనొప్పి తగ్గదు' అని సలహా ఇచ్చింది. ఇదేదో బాగానే ఉందనుకుంటూ... నేనూ వారితో పాటు అరవడం మొదలుపెట్టా... ఆ రోజలా అరిచినా ఆ తరువాత మరోసారి హాస్టల్‌లో క్రికెట్ మ్యాచ్ చూసే సాహసం చేయలేదు"అని చెప్పింది శైలజ.

"మా అబ్బాయి షణ్ముక్‌కు ఇంటర్నల్ పరీక్షలు. క్రికెట్ మ్యాచ్ ఈ టైంలోనే వచ్చిపడింది. ఇక వాడికి టీవీతోడిదే లోకం. చదువుకోరా అంటే... 'ఒక పక్కన క్రికెట్ వస్తుంటే చదవడమేంటి? నాన్సెన్స్. చదువెప్పుడూ ఉండేదే కదా. మ్యాచ్ చూడడం మిస్సయితే... మళ్లీ చూడగలమా?' అని వాదనకు దిగుతాడు"అని వాపోతున్నారు రోహిణి.

మీరూ క్రికెట్ వీరాభిమానులా... పరీక్షలున్నా పుస్తకాలు పక్కనపెట్టి టీవీ చూస్తున్నారా? 'చదువుకోరా' అని మమ్మీ చెబితే... ఎప్పుడైనా చదువుకోవచ్చు..... అని సమాధానమిస్తున్నారా? 'ఎప్పుడైనా' అంటే మీ ఉద్దేశమేంటి? ఫైనల్ పరీక్షల సమయంలోనూ క్రికెట్ మ్యాచ్ ఉందనుకోండి... క్రికెట్టే చూస్తూ కూర్చుంటారా? తల్లిదండ్రులు కారణమడిగితే... పరీక్షలెప్పుడైనా రాయొచ్చంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చినా... ఇప్పుడు మీకు ఏమీ అనిపించకపోవచ్చు. మీ తోటి విద్యార్థులు ఒక్కో తరగతి ప్యాసై పై చదువులకెళుతుంటే... అప్పుడు మీకెలా ఉంటుంది. క్రికెట్ మ్యాచ్ రిలే అవుతున్న టీవీ ముందు మనల్ని కట్టిపడేసిన క్రికెటర్లేమో... రన్నుల మీద రన్నులు తీస్తూ తమ స్కోరు పెంచుకుంటున్నారు. దానితో పాటు రాబడీ పెంచుకుంటున్నారు. మరి మనమో... మార్కుల స్కోరు పడిపోతే ఎక్కడికి రన్ చేయాలి చెప్పండి? చదువుల ఫీల్డులో డక్కౌటయితే... మన ఫేసు వాల్యూ ఏంటి? మరంచేత.....

నవ్వినా ఏడ్చినా కన్నీళ్ళే వస్తాయి. ఏడుస్తూ నవ్వించే, నవ్విస్తూ ఏడిపించే నటుడు రాజేంద్రప్రసాద్. ఇలా రెండు రకాలుగా ప్రేక్షకులను మెప్పించగల నటుడు ఈ నటకిరీటి. ఆ నటకిరీటానికి తొడిగిన కలికితురాయి ఇటీవలొచ్చిన నంది అవార్డు. ఉత్తమ హాస్యాన్నే కాదు ఉదాత్తమైన నటనను కూడా అందించగలడని "ఆ నలుగురు" సినిమా చూసినవాళ్ళకు అనిపించక మానదు. రాజేంద్రప్రసాద్‌తో ప్రజాశక్తి సినిమా విలేఖరి **చందు** జరిపిన మాటామంతి.

నవ్వించడమే కాదు ఏడిపిస్తా కూడా

నేను కేవలం కామెడీ ఆర్టిస్టే అయితే 'కాష్మోరా' 'ముత్యమంత ముద్దు' 'పుణ్యస్త్రీ' 'ఎర్రమందారం' వంటి విభిన్న తరహా చిత్రాల్లో నటించడం కుదరదు కదా! అందుకే హాస్యనటునికే పరిమితంగాకుండా ఇలా నేను కొన్ని కేరెక్టర్ పాత్రలు కూడా చేశాను. 'నేను ఒక సీరియస్ క్యారెక్టర్ చేద్దామనుకుంటున్నాను. నాకొక కథ రాయండి' అని ఎవరినీ ఎప్పుడూ అడగలేదు. 'ఆ నలుగురు' రచయిత మదన్, దర్శకుడు చంద్రసిద్దార్థ నా వద్దకొచ్చి చిత్ర కథ వినిపించారు. కథ విన్న తర్వాత 'ఇంత ఓల్డ్ క్యారెక్టర్ నాకని అనుకుంటున్నారు... నేను చేయకపోతే' అని అడిగితే 'మీరు చేయకపోతే ఈ సినిమా తీయం అన్నారు. 'ఈ క్యారెక్టర్ మీరే చేయాలి' అన్నారంటే యాక్టర్‌గా వాళ్ళకి నా మీద ఉన్న నమ్మకం. అమ్మ ఉందంటే వంటచేసి పెట్టడానికే అని చాలామంది అనుకుంటున్నట్లు రాజేంద్రప్రసాద్ అంటే కాసేపు నవ్వేసుకుని వెళ్ళిపోవచ్చనే భావన ఉంది. తల్లిని ప్రేరణగా కూడా తీసుకోవచ్చని మరుస్తున్నారు. రాజేంద్రప్రసాద్‌లో ఇంకో కోణం ఉందని గ్రహించి వారిద్దరూ నాదగ్గరికొచ్చారు. మలచగా మలచగా యాక్టర్ షార్ప్ అవుతాడు. మెచ్యూరిటీ వస్తుంది. అదొచ్చిన తర్వాత బాధ్యతాయుతమైన పాత్రల వైపు మళ్ళాలి. అందులో భాగమే 'ఆ నలుగురు'.



జీవించలేదు... మరణించాను...

'ఆ నలుగురు' చిత్రానికి ఏవిధమైన హోం వర్క్ చేశారనే విషయానికొస్తే ఒకటి కాదు రెండు మూడున్నాయి. రాజేంద్రప్రసాద్ అనే వాడు ఎలా కనబడతాడో, ఎలా ఉంటాడో అందరికీ తెలుసు. నవ్వించడమే కాదు ఏడిపిస్తానని తెలియదు. కానీ 'ఆ నలుగురు'లో రఘురాం పాత్ర రాజేంద్రప్రసాద్‌లాగా ఉండదు. రాజేంద్రప్రసాదే రఘురాం అవ్వాలి. నేను నవ్వగానే రాజేంద్రప్రసాద్ అని అందరికీ తెలిసిపోతుంది. ఇలా తెలియకుండా ఉండడానికి ఏం చేయాలి? అందుకని కొద్దిగా ఎత్తు పళ్ళు పెట్టాం. రఘురాం అనేవాడు 55 ఏళ్ళు పైబడిన వ్యక్తి. తల ఎలా ఉంటే బాగుంటుంది అని ఆలోచించి దానికి తగ్గ విగ్ తయారుచేయించాం. వీటన్నింటికీ మించి ప్రవర్తన, నడకలో కూడా తేడా కనబడాలి. నా జీవితంలో నాన్నగారిని అబ్జర్వ్ చేశాను. రామారావుగారిని ఒక నటుడిగా, ఒక వ్యక్తిగా అలాగే రామోజీరావుగారిని ఒక జర్నలిస్టుగా, ఒక బాస్‌గా అబ్జర్వ్ చేశాను. వయసు మళ్ళిన వారి నడక, ప్రవర్తనను అధ్యయనం చేశాను. ఇవన్నీ ఆ క్యారెక్టర్‌కి ఉపయోగపడ్డాయి. 'ఆ నలుగురు' సినిమాలో మీరు జీవించారని' చాలా మంది అంటుంటారు. కానీ 'ఆ నలుగురు సినిమాలో రఘురాం పాత్రలో నేను మరణించాను' అంటాను. రఘురాం పాత్ర వెనక కృషి ఉంది. అనుభవం ఉపయోగపడింది. లేకపోతే రఘురాం కనబడడు కదా... రాజేంద్రప్రసాదే కనబడతాడు. ఆ సినిమా పూర్తయ్యే వరకూ ఇంకో సినిమా కమిట్ అవ్వలేదు. ఇలా ఎన్నో ఇబ్బందులు పడితే, ఎన్నో త్యాగాలు చేయబట్టే ఆంధ్ర యూనివర్సిటీ వాళ్ళు డాక్టరేట్ ఇచ్చారు.



స్ట్రగుల్ లేందే ఏదీ ఊరికే రాదు

పేరు ఊరికే వస్తుంది అంటే నేను నమ్మను. నాకే కాదు. ఎవరికైనా సరే. ఒక మంచి పేరుగానీ, పాపులారిటీగానీ, సమాజంలో ఒక గుర్తింపుగానీ రావాలంటే ఎన్నో త్యాగాలు చేయాలి. ఎంతో కృషి కష్టం అవసరం. నా అనుభవం చెప్పిన పాఠం ఇది. స్ట్రగుల్ లేందే ఏదీ ఊరికే రాదని నా ఉద్దేశం. నేను ఫలానా రోజు ఇలా కష్టపడ్డాను. ఫలానా రోజు అలా కష్టపడ్డాను అని చెప్పాలంటే పెద్ద బుక్కే అవుతుంది. కొత్త వాళ్ళకి నేను చెప్పేది ఏమిటంటే కష్టపడందే, మన జీవితంలో కొన్ని త్యాగాలు చేయందే మనం ఏమీ సాధించలేం. వంద శాతం కష్టపడండి. 'నేను చాలా కష్టపడుతున్నానండీ... ఇంతలా... అంతలా... శ్రమిస్తున్నానండీ... కానీ నాకేమీ కలసి రావడంలేదు... అదే టైం అనుకుంటా...' అని కొందరు అంటుంటారు. టైం గురించి ఆలోచించకుండా చేస్తున్న పని గురించే ఆలోచించండి. రామారావుగారు, నాగేశ్వరరావుగారు, చిరంజీవిగారు ఎంత కష్టపడి పైకొచ్చారో అందరికీ తెలిసిందే కదా!

(...వచ్చేవారం మరిన్ని కబుర్లు)

చిన్నారి చిత్రకారులు

కోరాడ సత్తిబాబు,
10వ తరగతి,
చింతవలస,
విజయనగరం.



చిన్న సూర్య,
7వ తరగతి,
నవోదయ మోడల్ స్కూల్,
పాలకొండ,
శ్రీకాకుళం.

ఎనిమిది తేడాలెక్కడున్నాయో?



బుజ్జాయిలూ! పైన రెండు బొమ్మలున్నాయికదా. అందులో కోళ్లు ఎంచక్కా ఆహారం కోసం వెతుకుతున్నాయి. అవునా! ఈ రెండు బొమ్మలూ చూడ్డానికి ఒకేలా వున్నాయి. కానీ వాటిలో 8 తేడాలున్నాయి. అవి ఎక్కడెక్కడ వున్నాయో ఇట్టే కనిపెట్టాలి మరి.

కవల పిల్లలెవరబ్బా!



హేయ్! పై బొమ్మ చూస్తుంటే చాలా ముచ్చటగా వుందికదూ. ఎందుకంటే ఆరుగురు పాపాయిలు ఎంచక్కా పారాడుతున్నారు. అకస్మాత్తుగా చూస్తే వారంతా ఒకేలా వున్నట్టు అనిపిస్తుంది. కానీ వారిలో ఇద్దరు మాత్రమే ఒకేలా వుంటారు. అంటే... ఇద్దరు మాత్రమే కవలలు. వారెవరు?

'D'తో మొదలయ్యేవేవి?



హేయ్! పైన ఇంగ్లీషు అక్షరం 'డి'తో మొదలయ్యే పది పదాలు వున్నాయి. అవేమిటో గుర్తించండి చూద్దాం.

రంగులు పులిమితే....



బాలనేస్తాలు

30.10.05కు సరైన సమాధానాలు రాసినవారు

టి.వి.ఎల్.నాయక్, మారోజు రవి బ్రహ్మాచారి (6), శ్రీ వాణి విద్యాలయం, జనగాం. చిలకలపూడి హారిక (4), శ్రీ తేలప్రోలు ఇంగ్లీషు మీడియం హైస్కూలు, విజయవాడ. వి రాజనర్సయ్య (9), ఏటూర్ నాగారం, వరంగల్. పి.పూర్ణిమ (8), శ్రీ శర్వాణి పబ్లిక్ స్కూల్, ఏటూరు. ఎం. సురేష్ (9), ఎం.నాగేంద్రబాబు (7), ఎస్.జేమ్స్, ఎ.మునుస్వామి, సి.రమేష్, ఎ.శివప్రసాద్, ఆనందనిలయం హాస్టల్, శ్రీకాళహస్తి. కె.పాండునాయక్ (8), జడ్‌పిహెచ్‌ఎస్, భూత్‌పూర్. సునీత (10), ఎపిటిడబ్ల్యుఆర్ఎస్, వనపర్తి. ఎస్‌కె.బాజీ (9), జడ్‌పిహెచ్ స్కూల్, రావినూతల. కె.శంభిరెడ్డి (10), సిద్ధార్థ రెసిడెన్షియల్ స్కూల్, కోదాడ. ఎం.ఎ.మోయిజ్, అచ్చంపేట. పి.భరత్ (6), పి.దివ్య (3), జె.శాంతి, పి.వరలక్ష్మి, వనపర్తి, మహబూబ్‌నగర్. బాబు నరేంద్రప్రసాద్, (8), కె.విజయ్ కుమార్, (10), బి.రవితేజయాదవ్, (10), ఎస్. కవీంద్ర, (10), యు.ఎస్ అనిల్, (10), నరసింహులు, (10), షబ్బీర్ హుస్సేన్, (10), యు.ఈరన్న, (10), ఆర్.రంజాన్, (10), యు.ఎం అనిల్, (10), యం. ప్రసాద్, (10), యు. రాజశేఖర్, (10), యం.అనుదీప్, (10), జి నాగేష్, (10), కె.యం యాసీన్, (10), జి. విజయ్ ప్రకాశ్, (10), యం. తిమ్మప్ప, (10), యు. నాసీర్, (10), యం రాజేశ్, (10), బి.శ్రీనివాసులు, (10), శ్రీవేణు విద్యాలయం, లక్ష్మీపేట, ఎమ్మిగనూరు. కె.చరిత, 6వ తరగతి, సెంట్ పాయిస్ గరల్స్ హై స్కూల్, రామ్ గనర్, హైదరాబాద్.

6.11.05 సమాధానం:
మేడం క్యూరీ

వీరి వీరి గుమ్మడిపండు వీరి పేరేమి?



హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినదెవరో తెలుసా! మా పిచ్చిగానీ ఈయన తెలియని వారు ఎవరుంటారు చెప్పండి! అయినా సందర్భం వచ్చింది కాబట్టి మీకో విషయం గుర్తు చేయాలనిపిస్తోంది. అదేంటంటే... ఈయన పుట్టినరోజు సందర్భంగానే మనం బాలల దినోత్సవం నవంబర్ 14వ తేదీన జరుపుకుంటాం. ఇప్పుడు మీరు ఏం చేయాలంటే... వెంటనే కార్డుమీద సమాధానం రాసి పోస్ట్ చెయ్యాలి. మరి మా చిరునామా: **వీరి వీరి గుమ్మడి పండు,** బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.



అట్టమీది కథ

జి లక్ష్మీనరసయ్య
అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్

ఇంకొద్ది కాలమాగితే... "ఈ ఇరవై రెండో శతాబ్దంలో..." అంటూ చెప్పడం మొదలెడతాం. కేలండర్‌లో "రెండువేల ఐదో సంవత్సరం", "రెండువేల ఆరో సంవత్సరం"...ఇలా పెద్దపెద్ద అంకెలు కనబడతాయి. సంవత్సరాలకు సంవత్సరాలు ముందుకు ఒకటే పరుగెడతాయి. ప్రతీ ఏడాదిలాగే రేపుకూడా నవంబర్ 14, బాలల దినోత్సవాలు వచ్చేస్తాయి. వెళ్లిపోతాయి. కానీ నిజంగానే మన సమాజం అంత ముందుకెళ్లిన స్థితిలో ఉందా అని మన చుట్టూ ఉన్న బాలల్ని చూసినప్పుడు సందేహం కలగకమానదు.

బాలకార్మికులు ఇంకానా...?!

పాపం పుణ్యం ప్రపంచమార్గం
కష్టం సౌఖ్యం శ్లేషార్థాలూ
ఏమీ ఎరుగని పూవుల్లారా,
అయిదారేడుల పాపల్లారా...

అంటూ మొదలెట్టారు మన మహాకవి శ్రీశ్రీ. ఆయన బాలల బాల్యం గురించి రాసిన "శైశవగీతి" కవిత ఇంకా చదివితే...

గరిక పచ్చ మైదానాల్లోనూ,
తామరపూవుల కోనేరులలో,
పంటచేలలో, బొమ్మరిళ్లలో,
తండ్రి సందిటా, తల్లి కౌగిటా,
దేహధూళితో, కచభారంతో,
నోటుల వ్రేళులు, పాలబుగ్గలూ,
ఎక్కడ చూస్తే అక్కడ మీరై
విశ్వరూపమున విహరిస్తుండే
పరమాత్మలు
ఓ చిరుతల్లారా!

...అని చదువుతాం. అబ్బ!... ఇలా అచ్చం శ్రీశ్రీ కవిగారు రాసినట్లే బాలల పరిస్థితి ఉంటే ఎంత బాగుండు అనిపిస్తుంది. అందమైన బాల్యం గురించి ఆ మహాకవి ప్రస్తావన అది. కానీ ఈ కఠిన వాస్తవప్రపంచంలో మనసున ముల్లు గుచ్చుకున్నట్లు మన చుట్టూ అనేక వైరుధ్యాలు, సామాజిక రుగ్మతలు, సాంఘిక అసమానతలు, వెనుకబాటుతనం తదితర సమస్యలు కళ్లకు కనబడతాయి. అందువలన పిల్లలందరూ సమగ్రంగా ఎదిగే అవకాశాలు లేకుండాపోయాయి. చిన్న వయస్సులోనే వివిధ రకాల పనులు చేస్తూ చిన్నలు పెద్దలుగా మారుతున్నారు. ముక్కుపచ్చలారని పిల్లలతో పనిచేయించి వారి శ్రమను దోపిడిచేసే బాలకార్మిక వ్యవస్థ ఒక సామాజిక దుష్పరిణామం.

జనవరి 26న ఒక జెండా పండుగ చేస్తామే... అదేనండీ... రిపబ్లిక్‌డే... గణతంత్ర దినోత్సవం... ఆ గణతంత్ర దేశంగా మన భారతదేశం ఏర్పడి ఇప్పటికి 54 ఏళ్లు. అయినప్పటికీ ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో నిరక్షరాస్యులు, బాలకార్మికులు ఉన్న దేశంగా పేరు తెచ్చుకోవడం ఏవిటి చెప్పండి?! భారత రాజ్యాంగం ద్వారా బాలల మానసిక వికాసానికి, సర్వతోముఖాభివృద్ధికి అనేక రక్షణలు రూపొందించినప్పటికిన్నీ బాల్యం బానిసత్వంలో మగ్గుతూనే ఉంది మరి! ఎందుకిలా అని ప్రతీ నవంబర్ 14 బాలల దినోత్సవం నాడు తలబాదుకుంటూనే ఉన్నాం... కమిటీలు మీద కమిటీలు వేసి, నివేదికల మీద నివేదికలు తయారుచేస్తూనే ఉన్నారుకూడా! నిరక్షరాస్యత, అజ్ఞానం, నిరుద్యోగం, సామాజిక కట్టుబాట్లు, దిగజారిన జీవనప్రమాణాలు, ఆర్థిక వెనుకబాటుతనం, నిజవేతనాలలో పెరుగుదల లేకపోవడం ఇలాంటి అనేక కారణాలను చెప్పవచ్చు.

ఎవరు బాలకార్మికులు?

బడి బయట ఉన్న బడిఈడు పిల్లల్లో చాలా మంది ఏదో ఒక పనిలో కునారిల్లిపోతున్నారు. బడిలో ఉండాల్సిన బాలలు వారి అత్యంత ప్రధానమైన చదువుకునే హక్కు కోల్పోయి చాకిరీలో మగ్గిపోతున్నారు. ఏ రకమైన పనులు చేస్తున్న పిల్లలైనా వారందరినీ "బాలకార్మికులు" అని గుర్తించాలి. అయితే ఓ చిక్కొచ్చిపడిందండీ... అదేవిటంటే ఇప్పటికెంతమంది బాలకార్మికులున్నారయ్యా అని ఏ తల్లన్నా, ఏ అక్కన్నా ఉన్నపళాన అడిగితే అందుకు ఖచ్చితమైన లెక్కల్లేవని గుడ్లు తేలేయాల్సిందేనండి. ఇదిగో అంకె అని కచ్చితమైన గణాంక వివరాలు చెప్పడం కష్టం. వివిధ రకాల సర్వేలు వివిధ రకాల సమాచారాన్ని అందిస్తున్నాయి తప్పితే ఇంతమంది పిల్లలు పనుల్లో కూరుకుపోయి గిలగిలలాడుతున్నారని చెప్పే దిక్కులేదంటే నమ్మండి. కానీ ఈ సమస్య చాలా తీవ్రంగా ఉందనేది మాత్రం వాస్తవం.

ఒక్కసారి ఏమనుకోకుండా ఈ అంకెల్ని జీర్ణం చేసుకోండి...ప్లీజ్!

బాలకార్మిక వ్యవస్థను 1930ల్లోనే ప్రపంచవ్యాప్తంగా నిషేధించారు. బాగానే ఉంది! అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్ఓ) అంచనాల

రాజ్యాంగంలో ఏం చెప్పారంటే...

ప్రకరణం 23 : మనుషులను అమ్ముకోవటం, బిక్షాటన, నిర్బంద చాకిరీ నిషేధం. వాటిని ఉల్లంఘించిన వారు శిక్షార్హులు.

ప్రకరణం 24 : 14 సంవత్సరంలోపు బాలబాలికలను ఫ్యాక్టరీలలో, గనులలో, ఇతర ప్రమాదకర పనులలో పెట్టుకోవడం నిషేధం.

ప్రకరణం 39(సి) : బాలబాలికలు, యువకులు వారి ఆరోగ్యానికి సరిపడని పనులు చేయటాన్ని నివారించడం.

ప్రకరణం 39(ఎఫ్) : బాలలు స్వేచ్ఛాయుతంగా, గౌరవప్రదంగా, ఆరోగ్యవంతంగా పెరగడానికి తగిన అవకాశాలను, సౌకర్యాలను కల్పించాలని, బాల్యాన్ని పీడననుండి, నైతిక, భౌతిక నిర్లక్ష్యాలనుండి రక్షించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తుంది.

ప్రకరణం 45 : భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది మొదలుకొని 10 -14 సంవత్సరాలలోపుబాలబాలికలందరికీ నిర్బంద ఉచిత ప్రాథమిక విద్యను అమలుపరచాలి.

ప్రకరణం 46 : ఎస్‌సి, ఎస్‌టి , ఇతర వెనుకబడిన తరగతుల వారి విద్యా, ఆర్థిక ప్రయోజనాలను అభివృద్ధి చేసేందుకు, వారిని సాంఘిక దురన్యాయాల నుండి, దోపిడీల నుండి కాపాడాలని పేర్కొంది.

ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 5-14 సంవత్సరాల లోపు బాలబాలికలు దాదాపు ఇరవైఐదు కోట్లమంది తమ కడుపునింపుకోవడానికి రెక్కలుముక్కలు చేసుకుంటున్నారు. వీరిలో సగానికంటే ఎక్కువమంది రోజుకు పది గంటలకు పైగా పనిచేస్తున్నారు. ఐఎల్‌ఓ వారి తాజా లెక్కల ప్రకారం భారతదేశంలో తొమ్మిదికోట్లకు పైగా బాలకార్మికులు ఉన్నార్టండీ! ఇవి ఎలాగూ కాకిలెక్కలేనని మనమెరుగున్నదే... అందుకని ఆ సంఖ్య పదికోట్లకు పైగానే అని అనుకోకతప్పదుమరి! ఈ లోకం మొత్తంలో నూటికి 61మంది ఆసియాలోనూ, 32 మంది ఆఫ్రికాలోనూ, 7గురు లాటిన్ అమెరికాలోనూ ఉన్నారని అంతర్జాతీయ సంస్థవారు చెబుతున్నారు. ఇకపోతే మన ఇంటివిషయానికొస్తే...దేశంలోని అన్ని రాష్ట్రాల్లోకంటే మన ఆంధ్రప్రదేశ్ 16.6 లక్షలమందితో అగ్రగామిగా ఉందిటండీ! బాలకార్మికుల్లో ఎక్కువలో ఎక్కువగా 17.8 శాతంమంది మన రాష్ట్రంలోనేనట. కొన్ని స్వచ్ఛంద సంస్థలవారు మాత్రం 19లక్షల నుండి 25 లక్షల దాకా ఉండొచ్చంటున్నారు.

ఇంతకీ ఆ పిల్లలు ఏఏ పనుల్లో ఉన్నారంటే...

ఇందాక మనం చదివామే...శ్రీశ్రీగారి కవితలో...**"గరికపచ్చ మైదానాల్లోనూ/ తామరపూవుల కోనేరులలో/పంటచేలలో, బొమ్మరిళ్లలో....ఎక్కడ చూస్తే అక్కడ మీరై..."** అనే పాదాల్లో చదివినట్లు ఎక్కడచూస్తే అక్కడ బాలలు కనబడుతున్నారు గానీ...ఆహ్లాదంగా మాత్రం కాదు. బండెడు చాకిరీ చేస్తూ...పూటపూటకూ మెతుకుమెతుకూ వెతుక్కుంటూ దీనాతిదీనంగా కనబడుతున్నారు. మనది ప్రధానంగా వ్యవసాయదేశం కాబట్టి ఎక్కువ శాతం పిల్లలు పొలంపనుల్లో బాలకార్మికులుగా ఉన్నారు. వ్యవసాయానికి పరోక్షంగానో ప్రత్యక్షంగానో చాకిరీ చేస్తున్నారు. నీళ్ల తేవడం, పశుపోషణ, ఇంటిపనులు ఇలాంటివెన్నో చేస్తున్నారు. పెద్దపిల్లల్లా వోణీలు కట్టి నాట్లు, వరికోతల్లో నడుం వంచుతున్నారు. కొన్నిచోట్ల అప్పులు పాలైన తల్లిదండ్రుల బాకీలు తీర్చేందుకు వెట్టిచాకిరీకి వెట్టోళ్లుగా, కంబారితనానికి కంబార్లుగా, గొడ్డకాడ బుడ్డోళ్లుగా, పాచిపని పోరిలుగా వర్ణించలేనంత కష్టాలకు గురవుతున్నారు. శివకాశిలో అగ్గిపెట్టెల పరిశ్రమ గుర్తొస్తే మన కళ్లల్లో మెదిలేది మందు ఘాటుకి బొబ్బలెక్కిన చేతులతో పసివాళ్లే మన కళ్లల్లో మెదులుతారు. ఉత్తరప్రదేశ్, కాశ్మీర్‌ల్లోని తివాచీ పరిశ్రమలోనూ, చెన్నయ్ ప్రాంతంలో కోళ్ల పరిశ్రమలోనూ, ఉత్తరాది ప్రాంతాలలో మట్టిపరిశ్రమ, తేయాకు తోటలలో బాలకార్మికులు పనిచేస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీ మహానగరం, నజఫ్‌ఘర్ ఏరియాలో 'జరీ' పరిశ్రమలో, వాణిజ్య రాజధాని ముంబయ్, మదన్‌పురాలో గోల్డ్ ప్లేటింగ్ పరిశ్రమలో లెక్కలేనంతమంది పిల్లలు పనిలో నలిగిపోతున్నారు.

ఇంకా ఈ బాలశ్రామిక సమిధలను హోటళ్లలో, భవన నిర్మాణపనుల్లో, ఆటోనగర్ ఆయిల్ మడ్డి మురికిలో, మోటారు-గార్మెంట్ పరిశ్రమల్లో, మైనింగ్, చేనేత, చుట్ట-బీడీ తయారీల్లో, కొవ్వొత్తులు, పలకలు చేసేపనుల్లో, పాలిషింగ్, ప్యాకింగ్, మిల్లులు, వ్యవసాయాధారిత పరిశ్రమలు, వజ్రాల పాలిషింగ్, బ్రాందీషాపుల్లో, ఇంకా ప్రమాదకర పరిశ్రమలలో సైతం...ఇలా లిస్టు చెప్పుకోవాల్సివస్తే ఈ బాలకార్మికులు లేని చోటు లేదని ఒక్కమాటలో చెప్పాల్సివస్తుంది. ఇంకొన్ని చోట్ల గురించి చెప్పుకుంటే మన కళ్లనుంచి కన్నీళ్లు కాదు నెత్తురు కారాల్సిందే. చిన్నారి పసిమొగ్గల్ని బలవంతపు వ్యభిచారంలో "చైల్డ్ సెక్స్" అనే కుతిపేరిట భయంకర హింసకు గురిచేస్తున్నారు. మాదకద్రవ్యాల స్మగ్లింగ్, ఒంటె పరుగుపందాలు లాంటి ప్రమాదకర కార్యకలాపాల్లోనూ ఈ బాల్యాన్ని వినియోగించడం ఎంత హేయమో చెప్పలేం.

ఈ చాకిరీనుంచి తప్పించలేమా...చెప్పండి!

పాలకులు అనేకసార్లు అనేకరూపాల్లో ఈ వ్యవస్థను రూపుమాపాలని ప్రయత్నించారు. గత ప్రభుత్వం "పని నుండి బడికి", నేటి ప్రభుత్వం "బడిబాట" లాంటి అనేక చర్యలు చేపట్టాయి. అనేక స్వచ్ఛంద సంస్థలు మరెన్నో రూపాల్లో ప్రయత్నించాయి. ప్రయత్నిస్తున్నాయి. ఒక సందర్భంలో ఒక పిల్లాణ్ని పని మాన్పించి బడికి పంపుతున్నప్పుడు ఆ పిల్లాడి తల్లి, "బాబూ...మా తిండి సంగతి సూడండి...మేమే మా పిలగాళ్లని బడికి పంపుతాం...మా





కడుపుతీపి సంపుకుని మరీ మా చేతి సాయానికి, వేన్నీళ్లకు చన్నీళ్లలా ఆల్లని పనిలోకి అంపుతున్నాం గానీ...మాకు మాత్తరం మా పిలగాళ్లు సదూకోవాలనుండదా? ఆడిప్పుడు పనిమానేత్తే... మేం తీసుకొచ్చే ఆటికి తోడు వచ్చే ఐదాఱ్రూపాయలూ ఎవడిత్తాడు బాబూ..." అనడిగింది. ఈ కన్నతల్లి మాటలు ప్రభుత్వాలనూ, మరెందరినో తీవ్ర ఆలోచనల్లో పడేసింది.

మరేం చేద్దాం...?

చిన్నారులు శారీరకంగాను, మానసికంగాను, ఆధ్యాత్మికంగాను, సామాజికంగాను ఎదగడానికి, ఆరోగ్యం పొందడానికి, స్వేచ్ఛగా గౌరవమైన జీవితం గడపడానికి అనుకూలమైన పరిస్థితులుండాలని. చిన్నారులను దోపిడీ, వివక్షలనుండి రక్షించాలని బాలల రక్షణకు సంబంధించి 1959 సంవత్సరంలోనే యుఎన్ మానవహక్కుల ప్రకటన పేర్కొంది. 1989లో ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కమీషన్ బాలల హక్కుల తీర్మానం ప్రతిపాదనలను రూపొందించింది. నవంబర్20, 1989న అమోదించింది. ఇందులో 54 అర్టికళ్లను పొందుపరిచారు. 159 సభ్యదేశాలు జాతీయ చట్టాలను రూపొందించి ఈ ప్రతిపాదనలకు ఆచరణరూపం కల్పించాయి. అయినప్పటికీ...ఎక్కడేసిన గొంగళి అక్కడే...చర్విత చరణం...

యుద్ధం జరిగినా, దేశంలో సాయుధ సంఘర్షణ సంభవించినా, అల్లర్లు చెలరేగినా, వరదలూ, తుఫానుల వంటి ప్రకృతి వైపరీత్యాలు ముంచెత్తినా బలయ్యేది బాల్యమే. ప్రాణాలు కోల్పోయేవారు, వికలాంగులుగా మారేవారు, తల్లిదండ్రులను, ఇళ్లను కోల్పోయి అనాథలుగా మిగిలేవారు పిల్లలే. ఆఫ్రికాలాంటి దేశాలలో కరువు బాలలను పట్టిపీడిస్తోంది. ఇంత విపత్తు బాల్యం నెత్తిపై ఉంటే భవిష్యత్తరం...ఎలా తయారవుతుంది. ఈ సమాజం కొనసాగింపు బాలలే కదా! ఆ కొనసాగింపు ఇంత దుర్భరంగా ఉంటే ఎలామరి?

ఇప్పటికైనా...ఇకనైనా...ఈ దురవస్థను తొలగిద్దాం. మన బాలల బాల్యాన్ని బంగారు భవితగా రూపొందనిద్దాం. కేంద్రమో, రాష్ట్రమో, జాతీయమో, అంతర్జాతీయమో ఎవరమైనా బాల కార్మిక వ్యవస్థ నియంత్రణా చట్టాలను పటిష్టంగా అమలుచేద్దాం. నిరుపేద వర్గాల ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను చూపుతూ, దారిద్ర్యరేఖకు దిగువనున్న వారి శాతాన్ని తగ్గించాలి. ఉపాధికి దోహదపడే విద్యను అందించేలా విద్యావ్యవస్థలో సమూలమార్పులు తీసుకురావాలి. అన్నంపెట్టి, చదువునేర్పి, పేదకుటుంబాలను ఆదుకోవాలనే సుప్రీంకోర్టు తీర్పుకు తగ్గట్టుగా మార్పులు తీసుకురావాలి. నిరక్షరాస్యతను, బాలకార్మిక వ్యవస్థ కొనసాగడానికి గల ప్రధాన అడ్డకులను తొలగించకుండా, పేదరికాన్ని నిర్మూలించకుండా ఎన్ని పథకాలను ప్రవేశపెట్టినా ఈ సమస్య పరిష్కారం కాదు. పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించినపుడే భావిభారత పౌరులు ఉన్నతంగా తయారవుతారు. విద్యావంతులు, ఆరోగ్యవంతులు అయిన బాలలున్న దేశమే అభివృద్ధి పథాన నడుస్తుంది. అప్పుడు కచ్చితంగా కవులు గాయకులు గానం చేసినట్లు **ఉడుతల్లారా...బుడతల్లారా/ మీదే మీదే సమస్త విశ్వం/ మీరే లోకపు భాగ్య విధాతలు** అని ధైర్యంగా పాడగలం ✿

బాలకార్మిక నిర్మూలనా చట్టాల చిట్టా

1881 కర్మాగారాల చట్టం

1911 గనుల చట్టం

1933 బాలల శ్రమ తాకట్టు చట్టం

1951 ప్లాంటేషన్ లేబర్ యాక్ట్

1952 భారతీయ గనుల చట్టం

1958 మర్చెంట్ షిప్పింగ్ యాక్ట్

1961 మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యాక్ట్

1961 ఎపి రెంటల్ యాక్ట్

1966 బీడీ అండ్ సిగార్స్ వర్కర్స్ యాక్ట్

1986 చైల్డ్ లేబర్(ప్రొహిబిషన్ & రెగ్యులేషన్)

1988 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు దుకాణములు మరియు సంస్థల చట్టం

బాలకార్మికులతో విరాజిల్లుతున్న ఢిల్లీ మహానగరం

"అది జూన్ 2, 2005. నేను నా స్నేహితుడి సహకారంతో తూర్పుఢిల్లీలో జఫరాబాద్ అనే ప్రాంతానికి వెళ్లాను. అక్కడ ఇరుకిరుకు వీధుల్లో ఉండే 14 జరీ ఫ్యాక్టరీలను చూశా. ప్రతీ ఫ్యాక్టరీలోనూ దాదాపు 25-30మంది నాలుగేళ్ల పిల్లలనుంచి పధ్నాలుగేళ్ల వయస్సు పిల్లలు అమానవీయమైన చాకిరీ చేస్తూ కనబడ్డారు. వివరాలు తెలుసుకుంటే అక్కడ చుట్టుపక్కలనున్న 500 జరీఫ్యాక్టరీలలో ఐదువేలమంది బాలకార్మికులు పనిచేస్తున్నారని తెలిసింది. ఈ పిల్లలంతా బీహార్‌లోని సీతామర్హి ప్రాంతానికి చెందిన పేదపిల్లలు. మధ్య దళారులు ఈ బాలకార్మికులను సప్లయ్ చేస్తారు. వీళ్లలో చాలామంది పిల్లలు ఇంతకుముందు అనేకసార్లు ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు చేత వారివారి ఊళ్లకు ఇళ్లకు పంపించబడినవారే. వారి పేదరికం మళ్లీ వాళ్లను ఈ ఇరుకిరుకు చాకిరీ బతుకులకు నెట్టింది. ఈ పరిశ్రమలోనే కాదు ఇంకా అనేక రకాలపనుల్లో దాదాపు 14-15 లక్షలమంది బాలకార్మికులు ఈ ఢిల్లీమహానగరానికి తీసుకురాబడుతున్నారు."

- అశోక్ అగర్వాల్

ఆరోగ్యం

విటమిన్ల కథ

Vitamin B3 నియాసిన్



డాక్టర్ నాగినేని భాస్కరరావు

నియాసిన్ లోపం వల్ల పెల్లాగ్రా అనే వ్యాధి వస్తుంది.పెల్లాగ్రా సింద్రోమ్‌కు నాలుగు 'డి'లు ఉన్నాయి.డయోరియా (విరేచనాలు), డిప్రెషన్, డిమెన్షియా, చివరకు డెత్ (మరణం).



నియాసిన్ నీటిలో కరిగే విటమిన్ బి-3. నికోటినిక్ యాసిడ్, నికోటినమైడ్, వాటి జీవ సంబంధమైన క్రియాశీలక ఉత్పత్తులకు 'నియాసిన్' అనే పదాన్ని వాడుతారు.

ఎన్ఎడి, ఎన్ఎడిపి అనే రెండు సహ ఎంజైములకు ముందు ఉత్పత్తులుగా నికోటినిక్ యాసిడ్, నికోటినమైడులు పని చేస్తాయి. పెంటోజు, స్టీరాయిడ్, కొవ్వు ఆమ్లముల ఉత్పత్తికి, గ్లైకోలైసిసుకు, మాంసకృత్తుల జీవ క్రియకు, లాక్టేటు, పైరువేటు, సారాయి అనబడే ఇంధనాల ఆక్సీకరణకు నియాసిన్ లేక విటమిన్ బి-3 అవసరం. రోజువారీగా మగవారికి 16 నియాసిన్ ఈక్వివలెంట్లు, ఆడవారికి 14 నియాసిన్ ఈక్వివలెంట్లు అవసరం.

నికోటినిక్ యాసిడ్, నికోటినమైడ్‌లు జీర్ణాశయం, చిన్న ప్రేవుల్లో శోషింపబడుతుంది. కాలేయంలో కొంత ఎన్ఎడి నిల్వ ఉంటుంది. ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లమును బరువులో 60:1 నిష్పత్తి నిపుణతతో 'నియాసిన్'గా మార్చవచ్చు. అందువల్ల రోజువారీ అవసరాన్ని 'నియాసిన్ ఈక్వివలెంట్లు'గా చెబుతారు. నియాసిన్ లోపం వచ్చే గర్భిణీ స్త్రీలలో, కుటుంబ నియంత్రణకు నోటి ద్వారా మాత్రలు తీసుకొనే స్త్రీలలో - ట్రిప్టోఫాన్, నియాసిన్‌గా ఎక్కువ రేటులో మార్చబడుతుంది. అయితే విటమిన్ బి-6 లేదా రైబోఫ్లావిన్ లోపం ఉన్న వారిలో తక్కువ రేటులో ట్రిప్టోఫాన్, నియాసిన్‌గా మార్చబడుతుంది. అలాగే క్షయ రోగులకిచ్చే ఐఎన్‌హెచ్ మందు కూడా ట్రిప్టోఫాన్, నియాసిన్‌గా మారటాన్ని నిరోధిస్తుంది.

నియాసిన్ లోపం వల్ల పెల్లాగ్రా అనే వ్యాధి వస్తుంది. పెల్లాగ్రా లక్షణాలేమంటే ఆకలి లేకపోవడం, నీరసం, చికాకు, కడుపులో నొప్పి, వాంతులు ఉంటాయి. తరువాత జీర్ణకోశం వాయడం, నాలుక ఎర్రబడి వాయడం, చర్మంపై దద్దుర్లు రావడం, మచ్చలు రావడం, పొలుసులు ఏర్పడటం - ముఖ్యంగా సూర్యరశ్మి సోకిన చోట. బాగా ముదిరిన కేసుల్లో చర్మంపై వచ్చే దద్దుర్లు, మచ్చలు, పొలుసుల్ని కాజల్స్ నెక్లెస్ అంటారు. అవి మెడ చుట్టూ వలయంగా ఏర్పడటమే ఇలా పిలవడానికి కారణం.

స్త్రీలలో యోనిలో మార్పులు, అన్నవాహిక వాయడం సంభవిస్తాయి. విరేచనాలు అవుతాయి. ఇంకా మానసిక దిగులు (డిప్రెషన్), మూర్ఛలు, డిమెన్షియా (మానసికంగా మతిమరుపు) కల్గుతాయి. అందువల్ల పెల్లాగ్రా సింద్రోమ్‌కు నాలుగు 'డి'లు ఉన్నాయి. అవి డయోరియా (విరేచనాలు), డిప్రెషన్, డిమెన్షియా, చివరకు డెత్ (మరణం).

పరీక్ష ద్వారా మూత్రంలో తక్కువ స్థాయిలో ఉన్న 2 - మిథైల్ నికోటినమైడ్, 2 - పైరిడిన్ ద్వారా నియాసిన్ లోపాన్ని నిర్ధారణ చేయవచ్చు. చిక్కుడు కాయలు, పాలు, మాంసం, గుడ్లు మొదలగు వాటిలో నియాసిన్ ఎక్కువగా లభిస్తుంది. ధాన్యాల్లో తక్కువగా లభిస్తుంది. ✿

కథ

కర్లపాలెం నిరంజన్

ఆడుకుంటానంకుల్

మధ్యాహ్నం 12 గంటలు... సన్నని తుంపరతో.. చుట్టూ అలుముకున్న తేమతో... భూవ్యాకాశాలనేకం చేయడానికి ప్రయత్నిస్తున్న మంచుపొరతో వాతావరణమంతా ఆహ్లాదకరంగా ఉంది. ఆ రోజు ఆదివారం కావడం... హుషారుగాలిపే చల్లని వాతావరణం ఉండడంతో జూపార్కు పిల్లలతోనూ, పెద్దలతోనూ కోలాహలంగా ఉంది.

సింహాలతోనూ, చిరుతలతోనూ, జనాలు వేసే తినుబండారాలను అందుకోవాలని చేతులు చాచే కొండముచ్చులతోనూ, మనుషులను అనుకరించే కోతులతోనూ, రంగురంగుల పక్షుల కిలకిలా రవాలతోనూ ఆ ప్రాంతమంతా ఆహ్లాదకరంగా ఉంది.

అంతటి ఉత్సాహపూరితమైన వాతావరణంలోనూ ఉదాసీనంగా ఉన్నాడో అబ్బాయి. అతడే గౌతమ్. కిషోర్, మాలతి ఏకైక సంతానం. పెద్ద పేరున్న స్కూల్లో ఐదో తరగతి చదువుతున్నాడు. కిషోర్ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్. మాలతి మల్టీనేషనల్ కంపెనీలో పిఎ. నెలకు వారిరువురి సంపాదనా అరలక్షకు తక్కువుండదు.

రెండు మూడు నెలల నుండి గౌతమ్ ఉదాసీనంగా ఉండడాన్ని వారిరువురూ గమనిస్తున్నారు. ఖరీదైన బట్టలు, మార్కెట్టులో కొచ్చిన లేటెస్ట్ గేమ్స్ కొన్నారు. చివరికి చిన్న పిల్లల నిపుణునికి చూపించారు. ఈ రోజు జూకు తీసుకొచ్చారు. గౌతమ్‌లో వీసమెత్తు మార్పు కనిపించలేదు.

"చిన్నా... అటు చూడు" అంది మాలతి.

నెమలి పురి విప్పి నాట్యం చేస్తోందక్కడ. దాన్ని చూసిన గౌతమ్ మనసు వికలమైంది.

"అడవుల్లో స్వేచ్ఛగా నాట్యం చేసే నెమలికీ... పంజరంలో ఉన్న దీనికీ పోలికెక్కడ?" అనుకున్నాడు గౌతమ్ దానివంక జాలిగా చూస్తూ.

మరోపక్క... కోతులు... ఎండిపోయిన చెట్టు కొమ్మలపై గెంతులేస్తున్నాయి. వాటిని చూస్తూ కేరింతలు కొడుతున్నారు పిల్లలు.

గౌతమ్‌కు తాను చూసిన ఓ టీవీ ఛానల్ గుర్తొచ్చింది. ఎత్తైన చెట్లకున్న ఊడలను పట్టుకుని, సర్కస్‌లోలా విన్యాసాలు చేస్తున్నాయి కోతులు. వాటికున్న స్వేచ్ఛ, ఆనందం ఈ జూలో ఉన్న కోతులకుందా? గౌతమ్‌కు ఎక్కడో ఏదో తెలీని బాధ ముల్లుపెట్టిగుచ్చినట్లు.

ఇంకో పక్క మృగరాజు బోన్లోనుంచి మౌనంగా చూస్తోంది. అది చూస్తోందా? మౌనంగా రోదిస్తోందా? అన్నట్లుంది.

గజరాజు కుంభస్థలాన్ని మావటివాడు కుళ్లబొడుస్తున్నాడు. బాధతో అదిపెడుతున్న కంటతడిని చూసితట్టుకోలేకపోయాడు.

కాసులకోసం ఇంత కఠినంగా ఈ మనుషులెందుకు తయారౌతున్నారు? అనుకున్నాడు గౌతమ్.

గౌతమ్‌లో రోజురోజుకీ ఉదాసీనత పెరిగిపోతోంది. చదువులో ఆసక్తిని కనబర్చలేకపోతున్నాడు. మాలతీ కిషోర్‌కు ఏం చేయాలో పాలుపోలేదు.

కొలీగ్ రమాకాంత్ ఇచ్చిన సలహా మేరకు సైక్రియాట్రిస్టు దగ్గర ఓ రోజు అపాయింట్‌మెంట్ తీసుకున్నాడు కిషోర్.

గౌతమ్ మానసిక పరిణామాలను డాక్టరుకు చెప్పారు. ఆయన కౌన్సిలింగ్ ప్రారంభించారు.

"బాబూ నీ పేరేంటి?"

"గౌతమ్!"

"ఏ క్లాసు చదువుతున్నావ్?"

"......"

"మార్కులెలా వస్తున్నాయ్?"

తల్లిదండ్రుల వంక చూశాడు గౌతమ్ బేలగా.

గౌతమ్‌తో కొద్దిసేపు ఒంటరిగా మాట్లాడాలని చెప్పి కిషోర్ మాలతిలను బయటికి పంపాడు డాక్టర్.

"ఆ! ఇప్పుడుచెప్పు గౌతమ్... చదువంటే నీకిష్టం లేదా?"

"చదువుతూనే ఉన్నాగా"ముభావంగా సమాధానం.

"ఆటలంటే నీకిష్టమేనా?"

"చాలా ఇష్టం!" గౌతం ముఖంలో ఒకరకమైన వెలుగు గమనించాడు డాక్టర్.

"ఏఏ ఆటలంటే నీకిష్టం?"

"క్రికెట్, టెన్నిస్"

"స్కూల్లోనూ ఈ గేమ్స్ ఆడతావా?"

"అంత టైమెక్కడుంటుందంకుల్? హోం వర్కు పూర్తి చేసే సరికి రాత్రయిపోతుంది. ఇక స్లిప్ టెస్టులు, అసైన్‌మెంట్లు, యూనిట్ టెస్టులు ఇలా రోజూ ఏదో ఒక పరీక్షలుంటాయి. హోం వర్కయింతర్వాత పరీక్షల కోసం చదవటం. ఇక ఆడేదెప్పుడంకుల్? ఏ పరీక్షలోనన్నా తక్కువ మార్కులొస్తే 'పక్కింటి సురేష్‌ను చూసి బుద్ధితెచ్చుకో'అని అమ్మ, 'నా కోలీగ్ కొడుకును చూసి సిగ్గుతెచ్చుకో'అని నాన్న ఒకటే అరుస్తారు"

"'చెట్టుకొమ్మలను పట్టుకు ఎగిరేకోతుల్లా... పింఛం విప్పి ఆడే నెమలిలా... హాయిగా ఉండాలనుంది. ప్లీజ్ అంకుల్... అమ్మానాన్నలకు చెప్పండి. నాకు స్వేచ్ఛకావాలని చెప్పండంకుల్. ప్లీజ్ అంకుల్... ప్లీజ్" అంటూ ప్రాధేయపడ్డాడు గౌతమ్.

✿

ఉ'చి(తి)'తం

సింధు

ఎప్పటిలాగే వట్టు వదలని విక్రమార్కుడు జమ్మి చెట్టును సమీపించాడు. భేతాళుణ్ని భుజానేసుకుని వెనకడుగులు వేస్తూ నడవసాగాడు. విక్రమార్కుని ప్రవర్తనకు ఆశ్చర్యపోయిన భేతాళుడు "ఏంటి రాజా! వెనక్కు నడుస్తున్నారు?" అని ప్రశ్నించాడు. "ముందుకు నడుచుచూ సాధించలేనిది వెనక్కి నడుస్తూ సాధించగలనేమోనని ప్రయత్నించుచున్నా..." రాజరీవికి భంగంరాని భాషలో అంటూనే..వెంటనే విషయం మార్చి "అయినా భేతాళా, నిన్ను వశపరుచుకునే ప్రయత్నంలో రాజ్యం పోయింది..రాజరికం పోయింది...ప్రజాస్వామిక ప్రభుత్వాలూ వచ్చాయి...నువ్వు మాత్రం వశం కాలేదు. నువ్వు నాకు వశం కావాలంటే షరతులు మానవా... మరో మార్గం...." విక్రమార్కుని మనసును అర్థం చేసుకున్న భేతాళుడు ఫక్కున నవ్వాడు. దాంతో విక్రమార్కునికి కోపం పొడుచుకొచ్చింది. అయినా అదుపు చేసుకున్నాడు. "షరతుల్లేకుండా వశం కావాలంటే ఓ పద్ధతుంది. దాన్ని కనుక్కోగలిగావా నీకు లోబడుతాను. ఆలోచించు మరి" అన్నాడు. భేతాళుణ్ని మోస్తూనే విక్రమార్కుడు బుర్రగోక్కున్నాడు. జుట్టుపీక్కున్నాడు. ఎంత 'చించినా' ఆయన రాజరికపు బుర్రకు ప్రజాస్వామ్య పాలకుల ఎత్తులు ఒంటబట్టలేదు. చివరికి నిస్సహాయతను వ్యక్తం చేశాడు. అప్పుడు భేతాళుడే కలగజేసుకుని "అదే రాజా! మీకూ, భూలోకంలోని ప్రజాస్వామ్య పాలకులకూ తేడా. వాళ్లు ముందోమాట చెప్పి నమ్మించగలరు. ఆ తరువాత దానికి విరుద్ధంగా చెప్పి వాళ్లను బురిడీ కొట్టించగలరు. అలాంటి వాళ్లకు వశమైతే నా ప్రతిభ పదునెక్కుతుందికానీ నీలాంటి వాళ్ల వరమైతే నాకేంటి లాభం?'' అని భేతాళుడంటుండగానే "ఆపాపు భేతాళా! తప్పుదోవ పట్టిస్తూ దెప్పిపొడుపులేల? నువ్వు జెప్పే ప్రతిభేమిటో, ఆ ప్రతిభాశాలులెవ్వరో గుర్తించాకే..." అంటూ విక్రమార్కుడు దీర్ఘాలు తీస్తుండగానే బేతాళుడు అందుకున్నాడు. "ఇంకెవ్వరూ మన తెలుగు రాజ్యాధీశుడు వై.ఎస్.రాజశేఖర్ రెడ్డే. చంద్రబాబును మించిన సమర్థునిగా రుజువవుతున్నారు. పద! ఆయన్నే ఇంటర్వ్యూ చేద్దాం" వెంటనే విక్రమార్కుడు (భేతాళ, విక్రమార్క) టివి కెమెరామెన్‌గా మారాడు. భేతాళుడు విలేకరి అవతారమెత్తాడు. అతి సులువుగా వైఎస్ ఇంటర్వ్యూ సంపాదించారు. నేరుగా ప్రశ్నలు ప్రారంభించారు.

బి.తాళ్:- ఎన్నికల్లో మీరు రైతులకు చేసిన వాగ్దానాలను ఎలా అమలు చేస్తున్నారు?

వై.ఎస్:- ఆదర్శగ్రామాలను ఎంపిక చేసే పనిని మంత్రులకు అప్పగించాం. వారాపని చేయగానే నిధులిస్తాం.

బి.తాళ్:- తెలుగుదేశం వాళ్లు అమలు చేసిన 'పనికి ఆహార పథకం" బియ్యం మాదిరి మీరీ పథకాన్ని చేపట్టారన్నమాట. దాన్ని వాళ్లు అమలు జరిపినట్లే (మంత్రులే బియ్యాన్ని దారి మళ్లించారనే ఆరోపణలను దృష్టిలో ఉంచుకుని) మీరు కూడా ఆదర్శగ్రామాల నిధులను...(ఈ దెప్పి పొడుపును గుర్తించిన వైఎస్ షార్ప్‌గా స్పందిస్తూ)

వై.ఎస్:- చూడు. బి.తాళా! దెప్పిపొడుపులొద్దు. సూటిగా విషయానికొద్దాం. ప్రజలూ బతకాలీ, ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులూ బతకాలి. వాళ్ళూ మనుషులేనయ్యా! అందరూ బతికే అవకాశాన్ని చూపిస్తేనే మాకు పీఠాలు మిగుల్తాయ్. మంత్రుల మూతిగట్టి నేను బతగ్గలనా.....?

బి.తాళ్:- (మధ్యలోనే అడ్డుపడుతూ) అవునవును. అందరూ బతకాలిసార్. తామూ బతకాలంటే ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని రైతులు కోరుతున్నారు సార్!

వైఎస్ : అందుకే కదయ్యా! మేం అధికారం చేపట్టగానే ఉచిత విద్యుత్ ఫైల్‌పై సంతకం చేశాం....(వైఎస్ ఎంత ధీటుగా చెప్పారో అంతే ధాటిగా బి.తాళ్ అందుకున్నాడు)

బి.తాళ్ : 'ఉచితం' ఇచ్చిన వెంటనే సర్వీసు ఛార్జీ అన్నారు... ఆ తరువాత పేదలకే ఉచితం అంటూ.... ధనిక రైతులకు కత్తిరించారు. మరిది ఉచిత విద్యుత్‌ను

కొనసాగించడానికేనా సార్!

వైఎస్ : కచ్చితంగా ఉచిత విద్యుత్ కొనసాగించడానికే. నాలాంటి సంపన్న రైతులకు ఉచిత కోత బెట్టింది పేదలకు ఇవ్వడానికే. సర్వీసు ఛార్జీ అంటావా? 'ఉచిత భోజనం' అని ప్రకటించినంత మాత్రాన గ్లాసూ, విస్తరి, నీళ్ళూ ఉచితంగా ఇవ్వాలంటే ఎలాగయ్యా !

బి.తాళ్ : మరిప్పుడు రబీ పంటకు ఉచిత విద్యుత్‌నివ్వననడం...

వైఎస్ : ఖరీఫ్‌కు ఇవ్వాలంటే తప్పదయ్యామరి. అన్ని పంటలకు ఇస్తే షరతులతో అప్పిచ్చిన ప్రపంచబ్యాంకు ఊరుకుంటుందా? అయినా ఆ బ్యాంకు షరతుల్ని మన రాష్ట్రం మెడకు చుట్టింది తెలుగుదేశపోళ్లే కదయ్యా ! మరి నాకెలా తప్పుతుందంటావు?

బి.తాళ్ : మరైతే... ఖరీఫ్ పంటకైనా ఉచిత విద్యుత్ ఇవ్వడానికి ప్రపంచబ్యాంకు ఒప్పుకుంటుందా సార్ !

వైఎస్ : అందర్నీ కలుపుకుని, అన్నీ చక్కబెట్టుకు పోవాలంటే తప్పదు....

బి.తాళ్ : ఒకవేళ ఖరీఫ్‌కూ ఇవ్వొద్దంటే....

వైఎస్ : అందుకే కదా! మార్చిలోపు కెపాసిటర్లు బిగించినోళ్ళకే ఉచిత విద్యుత్ అనే ఆయుధాన్ని ముందే బయటకు తీసింది.

బి.తాళ్ : అబ్బ! ఏం తెలివి సార్. ఉచిత భోజనం అన్నారు. ఆశపడి మీ బంతిలో కూర్చుంటే... ముందు విస్తరి ధర వడ్డించారు. ఆపై నీళ్ళ ధర వడ్డించారు. చివరకు భోజనానికీ వడ్డిస్తున్నారు. భోజనం పెట్టే హోటల్‌లో కేవలం భోజనానికే ధర ఉంటుంది. 'ఉచిత'మని మీ దగ్గరకు చేరాక భోజనానికీ, విస్తరికీ, నీళ్ళకూ....

వైఎస్ : అదేనయ్యా ప్రజాస్వామిక పాలనంటే... మేం అధికారంలో ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ ఏం చేసింది. మధ్యనిషేధం కోసం ఉద్యమాలు నడిపింది. అధికారం చేపట్టింది. ఆపై సడలింపులు మొదలు పెట్టింది. చివరకు కరువులో గుక్కెడు నీళ్ళు దొరకని ప్రాంతాలకు సైతం పుష్కలంగా మద్యాన్నిచ్చింది. అలాగే.......

బి.తాళ్ : మీరు విద్యుత్ ఛార్జీల పెంపు వ్యతిరేక పోరాటంతో మొదలై... ఉచిత విద్యుత్ వాగ్దానంతో గద్దెనెక్కి.... ఇప్పుడు...

వైఎస్ : అదేనయ్యా ప్రజాస్వామిక రాజకీయం.. అలా అందర్నీ కలుపుకుని పోవడమే రాజకీయం.

బి.తాళ్: ధన్యవాదాలు సార్. చాలా చక్కగా విశ్లేషించారు. మీ దృష్టిలో పెట్టుబడిదారుడూ, భూస్వామీ, ప్రపంచబ్యాంకూ, శ్రామికుడూ, ఉద్యోగీ, ప్రజాప్రతినిదీ... అందరూ ప్రజలే. పులీ మేకను ఒకే గాట కట్టినట్టు అందర్నీ కలుపుకుని పోతే ఎవరికి న్యాయం జరుగుతుందో వేరే చెప్పాలా? (అంటూనే అదృశ్యమయ్యారు. అసలు రూపాల్లోకి మారారు)

" ఇప్పుడు చెప్పు రాజా ఆయన చంద్రబాబునాయుడైనా, వైఎస్ అయినా అధికారం వచ్చే వరకు వాగ్దానాలు మూటకట్టడం అది రాగానే పక్కనబెట్టడం, అన్నీ 'ఉచితం'గానే చేయడం సమర్థత కాదంటావా" అనగానే విక్రమార్కుడు ఓటమిని అంగీకరిస్తూ తలాడించాడు. దీంతో యథాప్రకారం భేతాళుడు తుర్రున పారిపోయి జమ్మిచెట్టు మీద చేరాడు.

సెన్సూ కామన్ సెన్సు

ప్రార్థించే పెదాలు... పని చేసే చేతులు...

నాగసూరి వేణుగోపాల్

"ఛీ.... ఈ సంగతి తెలుసుకుంటుంటే పూనకం పట్టేలాగుంది" అంటూ కుర్చీలో కూలబడింది సులోచన.

"ఏమిటమ్మా... పూనకం అంటున్నావ్" అంటూ ఆరా తీసింది. మిత్రురాలు కమల. " ఏమి చెయ్యాలో.. ఏదో ప్రపంచం సంగతులు తెలుసుకోవడం నాకు అలవాటు అయ్యింది. తెలుసుకోకుండా వుండలేను.." అంటూ సులోచన అంటుండగానే ఒక వార్తతో ఇద్దరు దృష్టి మళ్లించారు. "ఈ రోజు ఉదయం నిన్న జరిగిన భూకంపం గురించి పాకిస్తాన్ టీవీ ఛానల్‌లో చర్చ ప్రసారమవుతోండగా... భూమి కంపించింది.... దాంతో చర్చ ఆవి ప్రార్థనలు చేయడం ప్రారంభించారు..." అంటూ ఆ దృశ్యాలు చూపుతూ టీవీ వార్తలు వస్తున్నాయి. " చూశావుటే... చోద్యం భూకంపం వస్తే ప్రార్థనలు జరిగాయని మనం నోరు వెళ్లబెట్టుకొని చూశాం. ఇపుడు ఏకంగా టీవీలో భూకంపం వస్తున్నపుడు జాగ్రత్త చర్యలు వివరించడం పోయి, ప్రార్థనలు చేయడం ఏమిటి ? భూకంపం గురించి చర్చించే మేధావులు ప్రార్థన చేయమని ఉద్బోధించడం ఏమిటి... ?" అంటూ కమల శృతి కలిపింది.

"అదే కదా సమస్య ! భూకంపానికి కారణం కూడా మనకు బాగా తెలుసు... విజ్ఞానం బాగా అభివృద్ధి చెందివుంది. ఇపుడు దీనికి సంబంధించి ప్రత్యేక శాస్త్ర విభాగం వుంది. సునామి వచ్చినపుడు- అంటే... సముద్రం లోపల సంభవించిన భూకంపం గురించి సైతం వివరంగా మనకు తెలిసింది. కానీ వీటన్నింటినీ పట్టించుకోకుండా ప్రార్థన చేయమనడం నేరం. ఎందుకంటే కొన్ని జాగ్రత్త చర్యలు వివరిస్తే కొంతమంది అయినా బతికే అవకాశం వుంది. ఏమంటావ్ ?...." అని ప్రశ్నించింది. సులోచన.

"అవును... ఈ మూఢ నమ్మకాలకూ, చదువు లేకపోవడానికి చాలా సంబంధం వుంది కదా...' అంటూ కమల అడిగింది.

"నిజానికి... నేను మీ ఇంటికి వస్తుంటే ఇటీవల నేను టీవీలో చూసిన దృశ్యాలు కలత పెడుతున్నాయి. అంతలోనే ఈ వార్తలు... మీ ఇంటికి రాగానే..' అని సులోచన నిష్టూరంగా. " ఏమిటి తల్లీ... మా ఇంటికి రావడం వల్లనా "ఏమిటి ? "... అని కమల అడిగింది.



"అలాకాదు.... ఈ విషయాలు తెలుసుకోవడమే బాధగావుంది. ఎందుకంటే... ఈ మధ్య మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలలో సంభవించిన సంఘటనలు ఏమిటి ? గుర్తుందా ? చేతబడి చేశాడని ఒక వ్యక్తిని తగలబెట్టడం ఏమిటి? ఆ వూర్లో మంగలిలేడని, పర్వతాలు అనే వ్యక్తిని తెచ్చుకున్నారు. బావుందా ? ఎవరో జబ్బుపడితే ఇతన్ని తీసుకువెళ్ళి బతికించమని వేధించడం ఏమిటి ? అతనే చేతబడి చేశాడని తగలబెట్టి చంపాలని ప్రయత్నించడం ఎంత ఘోరం ? పరుగెత్తి పోతున్న ఆ వ్యక్తిని కటింగ్‌షాప్ పెట్టెలో వేసి గొళ్లెం వేసి మంట బెట్టడం నేరం కాదా? అంటూ'' సులోచన గుక్క తిప్పుకోకుండా మాటాడుతోంది. 'అవును ఆ వార్తల్లో ఒక ఆడమనిషి.. మేమే మంటల్లో తోశాం. మిగతావాళ్లు బతుకొద్దా ఏమిటి ? అని ధైర్యంగా దబాయించడం మరీ ఆశ్చర్యం ? " అంటూ కమల బాధ పడుతోంది.

" అదే కదా సమస్య.... అందుకే మనకు సెన్స్ లేదు. కామన్ సెన్స్ లేదు. అనడం... అదే రోజు మరో సంఘటన జరిగింది తెలుసా ? ఇలాంటి అర్థం లేని నమ్మకాలతో తల్లి దండ్రులను మంటల్లో నెట్టారట వారి పుత్రరత్నాలు. వారి పేర్లు, రవి, పునీష్ అట. ఏదో ఆధునికమైన పేర్లతో కనబడుతున్నా కానీ, తల్లి దండ్రులను మంటల్లో ఎలా తోయగలిగారట. సులోచన ప్రశ్న !

"మరి దీనికి పరిష్కారం ఏమిటి ? ఈ ఘోరాలు జరిగి పోవాల్సిందేనా ?" కమల ఆవేదన. "కానీ చూశావా కొడుకులు మంటల్లో తోసినా, ఆ వూరివారు వారించి రక్షించారు. గాయాలతో బయటబడ్డారు. అంతా వారికిది తప్పు, అర్థం లేదని తోచి వుంటుంది. ఆ మాత్రం అవగాహన వుండాలి. అది కేవలం ఇంగితం (కామన్ సెన్స్)తో వస్తుంది. దానికి సెన్స్ (సైన్స్) తోడవ్వాలి. అంతే కానీ దేశం మొత్తం భూకంపం వస్తే ప్రార్థనలు చేయమని ప్రోత్సహించగూడదు. అందుకే ప్రార్థించే పెదాలకన్నా పని చేసే చేతులు మిన్న- అంతే అర్థ వంతమైన పనులు చేసే చేతులు మిన్న అనడం ! ఆ మాత్రం కనీస అవగాహన ప్రపంచమంతటా రాదా అంటూ సులోచన ఆలోచన ఆలోచనలో పడింది. ✿



జైన-శైవ-వైష్ణవ-నవాబుల కొలనుపాక

హేమలత

అదో పెద్ద నగరం... ఈ మాట వినగానే విశాలమైన రహదారులు... అందమైన కట్టడాలు... ఎత్తయిన భవంతులు... ఉంటాయని ఊహించేస్తున్నారా? మీ ఊహ కొంతవరకు కరెక్టే. విశాలమైన రహదారుల స్థానంలో ముళ్లపొదలు, దట్టమైన సరుగుడు చెట్లుంటాయి మరి. ఎందుకిలా? శత్రువులు తమ నగరంలోకి చొరబడకూడదనీ, ఒక వేళ చొరబడ్డా సులభంగా లోపలికి ప్రవేశించకూడదనీ ఆనాటి పాలకులు తీసుకున్న జాగ్రత్తే దీనికి కారణం. ఈ నగరమే కొలనుపాక.

నల్గొండ జిల్లా ఆలేరు సమీపంలో గల ఈ ప్రాంతం ప్రముఖ జైన క్షేత్రంగా ఈనాటికీ విలసిల్లుతోంది. హైదరాబాద్ నుండి వరంగల్లుకు పోయే దారిలో ఆలేరు రైల్వే స్టేషన్‌కి 6కి.మీ.ల దూరంలో ఉంది. నల్లగొండ, వరంగల్లు జిల్లాల సరిహద్దు గ్రామం ఇది.

1731లో రావూరి సంజీవకవి తన వీరనారాయణ శతకంలో 'కొలనుపాక' అని మొదటి సారి పేర్కొన్నట్లు ఇక్కడివారు చెప్పుకుంటారు. కొలనుపాక గ్రామాన్ని మొదట్లో "కొల్లిపాక", "కొల్లియపాక", "కొల్లిపాకే" అనే పేర్లతో పిలిచేవారని ఇక్కడ దొరికిన శాసనాల ఆధారంగా తెలుస్తోంది. అంతే కాకుండా ఈ ప్రాంతాన్ని బింబావతి పురం, కుదుటనగరం, సరోవర కుటీరం, సోమశేఖర పురం, కుళుదపురం, కుల్‌పాక్ అనే పేర్లతో వ్యవహరించినట్లు స్థానికుల అభిప్రాయం. కూరగాయల రామయ కొలనుపాకలోని వీరనారాయణ స్వామిపై కీర్తనలు పద్యాలు రచించాడు. ఈ పద్యాల చివర "సరోవర కుటీర నివాసుండగు కూరగాయల రామయ" అని పేర్కొనటం వల్ల కొలనుపాకకు సరోవర కుటీరమనే పేరుండేదని తెలుస్తుంది. జైన,శైవ,వైష్ణవ మతాలకిక్కడ సమానాదరణ లభించింది. మతాచార్యులకు, కవులకు, దేశభక్తులకు ఇక్కడ అనేక పురస్కారాలు లభించాయి. రాష్ట్రకూటుల నుంచి నిజాం ప్రభువుల వరకు ఈ కొలనుపాకను పరిపాలించారు.

కాకతీయుల పరిపాలనానంతరం కొలనుపాక తన వైభవాన్ని కోల్పోయిందనే చెప్పొచ్చు. మొగలుల పాలనలో భాగంగా ఔరంగజేబు ఈ ప్రాంతాన్ని పరిపాలించాడు. పరిపాలనా సౌలభ్యం కొరకు విజాపూర్, గోల్కొండ ప్రాంతాలను ఆరు సుబాలుగా విభజించారు. అందులో ఒక పరగణాగా ఈ కొలనుపాక ఉండేది. ఇతని పాలనలో మొగలాయి సేనలకు ఓ వ్యక్తి సింహస్వప్నంగా ఉండేవాడు. అతడే సర్వాయి పాపడు.

అవి ఔరంగజేబు అవసాన దశలో ఉన్న రోజులు...

పాపడు వరంగల్ లోని ఖిలే షావురాన్ని స్థావరంగా ఏర్పరచుకున్నాడు. చుట్టుపక్కల గ్రామాలపై అధికారం చెలాయించేవాడు. దోపిడీలు చేసేవాడు. భువనగిరి పరగణాలో షాపురంలో కోట నిర్మించుకున్నాడు. దాన్ని ప్రధాన స్థావరంగా చేసుకుని మొగలాయి సేనలతో యుద్ధానికి తలపడ్డాడు. కొలనుపాక పరగణా ఫౌజుదారు ఖాసింఖాన్, అఫ్ఘన్‌లు తమ సైన్యంతో షాపురం పై దాడి చేశారు. ఈ దాడిలో ఖాసింఖాన్ చనిపోయాడు. అయినా సైనికులు వెనుకంజ వేయలేదు. పాపని కోటపై దాదాపు రెండు నెలలు దాడి చేశారు. ఫలితంగా పాపడు పారిపోయాడు.

ఔరంగజేబు ఊరుకోలేదు. పరారీలో ఉన్న పాపని వెతికిపట్టుకోవాల్సిందిగా హైదరాబాదు సుబేదారైన రుస్తుందిల్ ఖాన్‌ను ఆజ్ఞాపించాడు. ఇతడు పాపని చేతిలో హతమయ్యాడు. అనంతరం పాపడు భువనగిరి, తరిగొండ కోటలను హస్తగతం చేసుకున్నాడు. ఔరంగజేబు అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. బహుద్దూర్‌షా, యూసుఫ్ ఖాన్, రుజిబిహానీ అనువారిని పాపని పై దండెత్తుటకు పంపించాడు. కాంబక్ష్ కూడా పాపని పట్టుకోవడానికి తన సైన్యాలను పంపించాడు. కొలనుపాకనుంచి యూసుఫ్ ఖాన్ తన బలగంతో పాపని కోటపై దాడి చేశాడు. ఫలితంగా పాపడు కోటను కోల్పోయాడు. తరిగొండను చేరుకున్నాడు. తొమ్మిది నెలలు పోరాడాడు. "ఎప్పటికీ మీ వెంటే మేముంటాం"అని చెప్పే వారే పాపని వెన్నుపోటు పొడిచారు. దాంతో ఆయన హసనాబాదులో మరణించాడు. పాపని మరణానంతరం అతని తలను చక్రవర్తికి పంపారనీ, మొండెం హైదరాబాద్ కోట గుమ్మానికి వేలాడదీ శారనీ ప్రజలు చెప్పుకుంటారు. ఈ సంఘటన క్రీ.శ. 1709లో సంభవించింది. ఆ తరువాత ఈ గ్రామం మూడవ నిజాం సికిందర్‌జా బహద్దూర్ 18వ శతాబ్దంలో లాబొద్దీన్ ఖాన్‌కు జాగీరుగా ఇచ్చారు. వీరి వంశంవారైన మీర్ తురాబ్ ఆలీఖాన్ కాలమొచ్చేసరికి ఈ జాగీర్లు రద్దు అయ్యాయి. ఆరోజుల్లో జరిగిన మతమార్పిడులు, మత ఆవేశాలకు కూడా ఈ కొలనుపాక గ్రామం గురయ్యింది. ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి లాంటి కమ్యూనిస్టు మహామహులకు కూడా ఆ గ్రామ ఉద్యమాలతో సంబంధం ఉంది. వీర తెలంగాణా ఉద్యమ ఘట్టాలు కూడా ఈ గ్రామంలో జరిగాయి. కొలనుపాక గ్రామ ప్రజల వెట్టి వ్యతిరేక ఉద్యమాన్ని ప్రేరణగా తీసుకుని ఆ ప్రాంత ఉద్యమాలు నడిచాయి.

పురాతన చరిత్రకు మత సామరస్యతకు, ఐకమత్యతకు, అభివృద్ధికి చిహ్నమయిన కొలనుపాక గ్రామం ఒక ఆదర్శవంతమైనది.



అవీ... ఇవీ

వ్యాపార తెలివి

ఒక వ్యాపారి ఒక ప్రాంతంలో చెప్పుల వ్యాపారం ప్రారంభించాలనుకున్నాడు. ఎక్కడైతే బాగుంటుందో తెలుసుకు రమ్మని ఇద్దరు సేల్స్‌మెన్‌ను పంపాడు. ఒకడు మరుసటి రోజు ఇలా రిపోర్టు పంపాడు. "ఇక్కడ అందరూ వట్టికాళ్లతో నడుస్తున్నారు. చెప్పులు కొనేవారు లేరు". రెండోవాడు కూడా రిపోర్టు పంపాడు. "ఇక్కడందరూ వట్టికాళ్లతో నడుస్తున్నారు. చెప్పుల అమ్మకానికి మంచి అవకాశాలున్నాయి".

- ఎంకెఆర్





తరిగిపోతున్న
కాలం
చెరిగిపోతున్న
భావన
జారి పోతున్న
దృశ్యమానం

మరో ప్రళయం

తనకు కావల్సిన దానికై
భూ తల్లి కడుపులో చెయ్యిపెట్టి కెలుకుతాడు
బల నిరూపణకు
కడలి కడుపులో కల్లోలం రేపుతాడు
వ్యర్థాలతో
పర్యావరణం నాశనం చేస్తాడు
నింగి నేలా గాలి నీరూ మలినం
ఓజోను
క్షీణం....
ఆమ్ల వర్షమారంభం...
భూభ్రమణంలో మార్పు
భూ పొరల్లో సర్దుబాట్లు
ఖగోళం ఛేదిస్తూ
భూగోళం విచ్ఛేదం చేస్తూ
సాగే విజ్ఞానం శ్రుతి మించితే
భూగోళం పై దీనాలాపన తథ్యం
విజ్ఞానం మానవతా దృష్టితో సాగకపోతే
గ్లోబల్ వార్మింగ్‌లో
భూగోళం కనుమరుగు
మంచు కరిగి
మట్టి మరిగి
నిన్నటి సునామియో,
జలప్రళయమో,
అగ్గి ప్రళయమో...

- శ్రీపాది రామచంద్ర

(నవంబర్ 19 జాతీయ పర్యావరణ దినోత్సవం)

విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

'కనుచూపు మేరలో' బ్లాక్ హోల్స్?

ఈ మహావిశ్వంలో అన్నిటికన్నా అత్యంత విచిత్రమైనవి బ్లాక్ హోల్స్. మన చుట్టూ కనిపించే అనేక కోట్ల గెలాక్సీల్లో బ్లాక్ హోల్స్ ఉన్నాయని తెలుసు గాని వాటిని చూడ్డం సాధ్యం కాదని శాస్త్రవేత్తలు ఇప్పటివరకు చెబుతూ వచ్చారు. అయితే ఇటీవల చైనా శాస్త్రవేత్తలు కొందరు 'నేచర్' పత్రికలో రాసిన విషయాలు పరిశీలిస్తే చూడలేని, చూడ్డం సాధ్యంకాని బ్లాక్ హోల్స్‌ను మానవుడు చూడగలిగే కాలం ఇంకెంతో దూరంలో లేదనిపిస్తోంది. చూడలేని వాటిని చూడ్డం...ఏమిటీ గందరగోళం అనుకోకండి. బ్లాక్ హోల్సు గురించి శాస్త్రవేత్తలు కనుగొంటున్న కొత్తకొత్త విషయాలు మనల్ని మరిన్ని కొత్త ప్రశ్నల్లోకి నెడుతున్నాయి.

బ్లాక్‌హోల్ అనేది తన పరిధిలోకి వచ్చే ప్రతివస్తువునూ తనవైపు ఆకర్షించుకుని, తనలో కలిపేసుకునే ఒక వస్తువు. చివరికి కాంతిని కూడా అది బయటకు రానివ్వదు. కాంతికూడా బయటకు రాదు కాబట్టి అది మన కళ్లకు కనిపించదు. ఎందుకిలా జరుగుతుంది? అంటే దీనికి ఒక చిన్న వివరణ ఇవ్వాల్సిఉంటుంది.

నేలమీద మనం నిలబడి ఒక బంతిని ఆకాశంలోకి విసిరామనుకోండి, బంతిని మనం ఎంత వేగంగా విసిరితే అది అంత ఎత్తుకు పోయి తరువాత కిందికి పడిపోతుంది. కిందికి పడిపోవడానికి కారణం భూమి గురుత్వాకర్షణ శక్తి బంతిని కిందికి లాగడమే. బంతిని మరింత వేగంగా విసిరితే అది మరింత ఎత్తుకు పోతుంది. ఇంకా, ఇంకా వేగంగా విసురుతూ పోతే ఒక దశవచ్చాక అది భూమి గురుత్వాకర్షణ శక్తిని దాటుకుని పైకి పోతుంది. ఇంక కిందికి రాదు. రాకెట్లను ఈ సూత్రం అధారంగానే అంతరిక్షంలోకి పంపుతారు. ఏ వస్తువైనా భూమి గురుత్వాకర్షణ శక్తిని దాటిపోవాలంటే సెకనుకు 7 కిలోమీటర్లు వేగం ఉండాలి. ఆ వేగానికి లోపుంటే కిందపడిపోతుంది, దాటితే అంతరిక్షంలోకి పోతుంది. దీన్నే 'ఎస్కేప్ వెలాసిటీ' అంటారు. అంటే గురుత్వాకర్షణ శక్తిని 'తప్పించుకు పారిపోయే' వేగమన్నమాట. పదార్థం సాంద్రత పెరుగుతున్న కొద్దీ 'పారిపోయే వేగం' పెరుగుతుంది. ఒక్క భూమి పట్టే ప్రదేశంలో నాలుగు భూముల పదార్థం ఉందనుకోండి ఆ మేరకు 'పారిపోయే వేగం' పెరుగుతుంది. అంటే ఒక వస్తువును అంతరిక్షంలోకి పంపాలంటే ఇంతకుముందుకన్నా వేగంగా పైకి విసరాలన్నమాట. పదార్థం సాంద్రత పెరుగుతూ, పెరుగుతూ పోతుంటే వస్తువు 'పారిపోయే వేగం' కూడా పెరుగుతూ పోతుంది. 'బ్లాక్‌హోల్'లో పదార్థం ఎంత సాంద్రతలో ఉంటుందంటే అది కాంతి వేగంతో వెళ్లే వస్తువును కూడా బయటకు పోనివ్వదు. అంటే కాంతిని కూడా బయటకు పోనివ్వదు. విశ్వంలో కాంతి వేగం (సెకెనుకు 3 లక్షల కిలోమీటర్లు)కు మించిన వేగంతో ఏ వస్తువూ ప్రయాణించదు, ప్రయాణించలేదు. కాంతిని కూడా బయటకు పోకుండా ఆకర్షించే గురుత్వాకర్షణ గల వస్తువులే 'బ్లాక్ హోల్స్'. ఒక పెద్ద నక్షత్రం అంతరించిపోయే దశలో పేలిపోయి, తనలోని పదార్థాన్ని అంతరిక్షంలోకి విడిచిపెడుతుంది. వీటిని నోవా, సూపర్ నోవా అంటారు. మిగిలిపోయిన పదార్థం నక్షత్ర కేంద్రంలో కుదించుకుపోయి ఒక అతి సాంద్రమైన గోళంగా మారుతుంది. ఇక్కడినుండి కాంతి రాదు కాబట్టి మామూలుగా ఈ గోళాలు కనిపించవు. అందుకే వాటిని బ్లాక్ హోల్స్ అని పేరుపెట్టారు. కాని సూపర్ నోవాలు ఏర్పడినచోట్లలో బ్లాక్ హోల్స్ ఉన్నట్లు శాస్త్రవేత్తలు అనేకపద్ధతుల ద్వారా కనిపెట్టారు.



ఇప్పుడు చైనా శాస్త్రవేత్తలు కొత్తగా కనుగొన్నదేమంటే మన పాలపుంత గెలాక్సీ మధ్యలో ఒక అతిపెద్ద (సూపర్ మాసివ్) బ్లాక్‌హోల్ ఉందని దాన్ని కనుగొనడం కూడా సాధ్యమేనని. నిజానికి మన పాలపుంత గెలాక్సీ కేంద్రంలో బ్లాక్ హోల్ ఉందని ఇంగ్లండులోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన మార్టిన్ రీస్ 1971 లోనే కనుగొన్నాడు. శాస్త్ర వేత్తల అంచనా ప్రకారం 14.5 కోట్ల వ్యాసం గల ఒక గోళాకార ప్రదేశంలో 40 లక్షల సూర్యగోళాల పరిమాణం గల పదార్థం ఒక్కచోట కుదించుకుపోవడం వల్ల ఈ బ్లాక్‌హోల్ ఏర్పడింది. ఈ గెలాక్సీ మనకు 26,000 కాంతి సంవత్సరాల దూరంలో 'ధనూరాశి' (సాగిట్టేరియస్) వైపున ఉంది. అంటే మనం సెకెనుకు 3 లక్షల కిలోమీటర్ల వేగంతో 26,000 సంవత్సరాలు ప్రయాణిస్తే ఎంత దూరం వస్తుందో అంత దూరంలో ఉందన్నమాట. ఏమిటింత దూరం అనుకోకండి, విశ్వంలో దూరాలు అలాగే ఉంటాయి.

పాలపుంత కేంద్రంలోని గెలాక్సీ కేంద్రంలోని బ్లాక్‌హోల్ నుండి ఒక రకమైన రేడియోతరంగాలు వస్తున్నాయని షాంఘై ఖగోళ పరిశోధనాశాల శాస్త్రవేత్త జి క్వియాంగ్ షెన్ చెప్పాడు. ఇతని బృందం పది టెలిస్కోపుల సహాయంతో పరిశోధన చేసి ఈ విషయాన్ని కనుగొన్నట్లు నేచర్ పత్రికకు తెలిపారు. గెలాక్సీ కేంద్రంలో బ్లాక్ హోల్ సరిహద్దు చుట్టూ ఒక నీడలాంటి ప్రదేశం, దాని చుట్టూ రేడియోతరంగాల రింగులు ఉన్నాయని వారు చెప్పారు. బ్లాక్ హోల్ సరిహద్దును 'ఈవెంట్ హోరిజన్' అంటారు. ఇక్కడినుండి ఏదీ దాని ఆకర్షణను దాటి బయటకుపోదు. కాని ఈ ప్రదేశానికి అయిదు రెట్లు దూరం వరకు బ్లాక్ హోల్‌నుండి వస్తున్న రేడియో తరంగాల నీడ ఉందని చైనా శాస్త్రవేత్తల బృందం చెబుతోంది. గెలాక్సీ కేంద్రంలోని విపరీతమైన రేడియోవికిరణాల మధ్య ఈ నీడను స్పష్టంగా గుర్తించి, ఫోటో తీయాలంటే ఇంకా ఆధునిక పరికరాలు సమకూర్చుకోవాల్సి ఉందని, వాటిని సమకూర్చడం సాధ్యమేనని వారు చెప్పారు. ఇదే జరిగితే బ్లాక్ హోల్ ఉనికిని దృశ్యరూపంలో పట్టుకున్నట్లవుతుంది. అంటే బ్లాక్ హోల్ ఉందన్న విషయాన్ని ఖచ్చితంగా నిరూపించినట్లవుతుంది. అప్పుడు ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన 'సాధారణ సాపేక్ష సిద్ధాంతం' కూడా నిరూపించబడుతుంది. విశ్వంలో బ్లాక్‌హోల్స్ వంటి పెద్ద ఖగోళ వస్తువులు తాము తిరుగుతూ స్పేస్‌నూ (దూరాన్ని), కాలన్ని కూడా వంపు తిప్పుతాయని ఐన్ స్టీన్ చెప్పాడు. గురుత్వాకర్షణ అనేది ఇలా వంపు తిరగడమే అని చెప్పాడు. ఆ విధంగా విశ్వానికి ఎల్లలు లేవని ప్రతిపాదించాడు.

కొత్త పుస్తకాలు

శాస్త్రీయత పెంచే వ్యాసాలు

హ్యూమనిస్టుగా ప్రసిద్ధులైన ఎన్. ఇన్నయ్య తాను నమ్మి ఆచరించే హేతువాద, మానవవాద సిద్ధాంతాలకనుగుణంగా... సమాజంలో చోటు చేసుకున్న మూఢనమ్మకాలనూ, అంధ విశ్వాసాలనూ, వాటికి ప్రాతిపదికగా నిలిచిన మతాల గుట్టునూ వివరిస్తూ పుంఖానుపుంఖాలుగా వ్యాసాలు రాశారు. వీటన్నింటినీ వివిధ శీర్షికలుగా విభజించి ఈ పుస్తకాన్ని వెలువరించారు. ముందుగా హేతువాద, మానవవాద వ్యాసాలు ఇంద్రియాతీతశక్తులు, మూఢ నమ్మకాలు, ఆధ్యాత్మికత పేరుతో చేసే మోసాలు, టెలిపతి - జ్యోతిష్యంలోని బూటకాన్ని పలు వ్యాసాలు హేతుబద్ధంగా ఖండించిన తీరు మనల్నాకట్టుకుంటుంది. మతం-ప్రవక్తతో దేవుని పేరిట అమాయక ప్రజలనెలా అణిచివేతకు గురి చేస్తున్నారో తెలిపే వ్యాసాలున్నాయి. అనిబిసెంట్, అరవిందులతో పాటు బాబాలు- స్వాములు- అమ్మలు- మూఢభక్తి- స్వస్థత కూటముల పేరిట ప్రతి మతంలోనూ ప్రజలను బహిరంగంగా దోపిడి చేస్తున్నారు. సైన్సు పేరిట కొనసాగే హిస్టీరియా-మెస్మరిజం లాంటి దొంగజబ్బుల బండారాన్ని బయటపెట్టారు. శాస్త్రీయ అవగాహనను, ప్రజాస్వామ్య దృక్పథాన్ని మతాలెలా, ఎందుకు వ్యతిరేకిస్తాయో ఒక్కొక్క మతాన్ని ఆధారం చేసుకొని విశ్లేషించారు. జాతి పునర్వికాసమెలా ఉండాలో, అదెలా వస్తుందో తెలిపాలి. చదువుకున్న వారికి మూఢ నమ్మకాలెందుకుంటాయి? అని ప్రశ్నిస్తూ హేతువాదుల కార్యరంగాన్ని వివరిస్తారు. చిన్న పిల్లల హక్కుల గురించి వివరిస్తూ... మతాలకు దూరంగా పిల్లలనుంచితేనే వారు పరిపూర్ణంగా వికసిస్తారంటారు. రాజకీయాల్లో కులం అంటరానితనం సెక్యులరిజాన్ని అపహాస్యం చేస్తున్నాయంటూ... అంబేద్కర్-గాంధీల ప్రవర్తనా ఆలోచనా విధానాన్ని విశ్లేషించారు. మనలో వ్యక్తి ఆరాధనాతత్త్వం పెరిగిపోయాయి. ఫలితంగా ఆయా వ్యక్తులను మహాపురుషులుగానూ, దేవుళ్లుగానూ భావించే తత్వం పెరిగింది. దీన్ని నిరసిస్తూ వాళ్లూ మనలాంటి మానవులేననీ, వారిలో ఉన్న బలహీనతలను - లోపాలను ఎత్తి చూపుతూ, మన కళ్లు తెరిపించే వ్యాసాలు "జీవన చిత్రణలు" అనే రెండో అధ్యాయంలో చోటు చేసుకున్నాయి. హిందూ నెపోలియన్‌గా వివేకానందుడు, మూర్ఛలరోగి.... రామకృష్ణ పరమహంస, మత ప్రచారకురాలిగా మదర్ థెరిసాను, గాంధీలోని సామ్యతాన్ని- అవకాశవాదాన్ని, ఫ్రాయిడ్ దొంగ వేషాలను, టంగుటూరి ప్రకాశం రౌడీ రాజకీయాలను ఆధారాలతో సహా బహిరంగపరచడం వారి అభిమానులకు షాక్ కలిగించే విషయమే!. అయినప్పటికీ అందులోని నిజాలను కాదనలేం. చివరకు రచయిత యం. ఎన్ రాయ్ లోపాలను వైఫల్యాలను ఎత్తిచూపడంలో వెనుకాడలేదు. అలాగే పీటర్ సింగర్ లాంటి తాత్వికులను, ఆర్థర్ కాటన్ లాంటి మనవతావాదిని, ఎరిక్ ఫ్రామ్, రాణీ ఎజిలె లాంటి హ్యూమనిస్టులను గోరాశాస్త్రి, యం.వి శాస్త్రి లాంటి జర్నలిస్టు ప్రముఖులను విశిష్టవ్యక్తులుగా అభివర్ణించే వ్యాసాలున్నాయి.

పాఠకులలో వైజ్ఞానికావగాహన పెంపొందడానికి 'సైన్సు సంగతులు' మూడవ అధ్యాయం తోడ్పడుతుంది. వీటితోపాటు హేతువాద దృక్పథంతో కూడిన కొన్ని ఆంగ్ల రచనల పుస్తక సమీక్షలు చివరిభాగంలో చోటుచేసుకున్నాయి.

- కె.పి. అశోక్ కుమార్



అబద్ధాల వేట
నిజాల బాట

వెల : 150-/ పేజీలు : 432
ప్రతులకు :
ప్రజాశక్తి బుక్ హౌస్,
విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని
బ్రాంచీలలో దొరుకును.

జనం కోసమే ఈ కవనం

కమ్యూనిస్టు పార్టీ ప్రజలకు చెందిన అన్ని పార్శ్వాలనూ పట్టించుకుంటుంది. ముఖ్యంగా అన్ని భావోద్వేగాలనూ నమోదు చేయగల, ప్రదర్శించి ఇతరులను స్పందింపజేయగల శక్తి ఉన్న సాహితీ సాంస్కృతిక రంగాన్ని మరింత ప్రేమగా, అంతకుమించి బాధ్యతగా చూసుకుంటుంది. అందుకేనేమో...సిపిఐ(ఎం) 21వ రాష్ట్ర మహాసభలు జరిగిన వరంగల్ పట్టణాన్ని కవితాస్ఫూర్తితో నింపాలని జనకవనం నిర్వహించింది. 2005 జనవరి 23న దాదాపు 180మంది కవులతో కూడిన భారీ కవితాసమ్మేళనం ఈ జనకవనం. కవితా పఠనం, కవిసమ్మేళనం లాంటి పాతపేర్ల స్థానంలో "జనకవనం" అని పేరు పెట్టడంలోనే ఈ కవితా పఠనానికి, అందులో కొలువుదీరే కవితల తాత్వికతను చెప్పకనే చెప్పినట్లయ్యింది. జనకవనం నిర్వాహకుల్లో ముఖ్యులైన తెలకపల్లి రవిగారు..."ఈ కవిత్వం ప్రజల కోసం అని, ఇది ప్రజల కవిత్వం అని, ఈ వేదిక విశాలత్వాన్ని కూడా ప్రతిబింబించుతుందని 'జనకవనం' రూపుదిద్దుకుంది" అంటారు. ఆ జనకవనంలో పాల్గొన్న అందరి కవుల కవితలనూ పరిచిన పేజీల సమాహారం ఈ 176 పేజీల పుస్తకం. చమురుదాహం వెనుక అమెరికావాడి... కమురుమోహంపై సాధనాల వెంకటస్వామినాయుడు తన కవిత ద్వారా నిప్పులు కక్కారు. "చమురు దాహం కావచ్చు...కమురు మోహం కావచ్చు/ వాడు బాంబులతో బంతులాట అడతాడు/ ఆహార పొట్లాలతో పొట్టలు కొడతాడు" అని ఈ కవి సామ్రాజ్యవాదాన్ని బట్టబయలు చేస్తే, కటుకోర్వుల రమేష్ "నీ యుద్ధనీతికి/ వృద్ధాప్యం దాపురించి/ ముదుకాళ్లతో/ ప్రపంచ శాంతిముందు/ మోకరిల్లక పోవు/ నీ ముగింపు దృశ్యాన్ని/ మేము చూడకపోము" అని అంతిమ పరిష్కారాన్ని చూపించారు. తాళ్లపల్లి రాంబాబు కవిత "పాస్‌పోర్టుకి వీసాకి మధ్య/ ఆఖరి చూపులు టేకాఫ్ అయ్యాక/ బలిసిన కంప్యూటర్ దేశమొక/ డాలర్ ఎరపెట్టి బానిసని చేస్తుంది" అంటుంటే, నరసింహుడి కవిత "ప్రపంచ చరిత్ర వాన్నెప్పుడూ క్షమించదు!?/ మృతుల దిబ్బలో మృత్యుహేల" అని హెచ్చరిస్తోంది. మొత్తంమీద ఈ నూటెనభై కవితలూ ఒక్కపెట్టున గొంతెత్తి సామ్రాజ్యవాదానికి డెత్ వారెంట్ ప్రకటిస్తున్నాయి. "స్థలమేదైతేనేం... నాడు జలియన్ వాలాబాగ్ నేడు బషీర్‌బాగ్" అని జి బుచ్చయ్య బషీర్‌బాగ్ రక్తాన్ని గుర్తుచేశాడు. "ఈ దేశ చరిత్ర ఎర్రసిరాతో రాస్తేగానీ ఆరవు ఈ నెత్తుటి మరకలు" అంటూ కర్తవ్యబోధ చేస్తున్నాడు. "వరంగల్ జనకవనంలో ప్రతిధ్వనించిన ప్రజాకవితల సంకలనం పెల్లుబుకిన అక్షరచైతన్యం. ప్రభవిస్తున్న సృజనకు ప్రతిబింబం" అని వెనుకఅట్టమీద ప్రకటన అక్షరాల నిజం.

- శంకర్



జనకవనం-2005
ప్రచురణ సిపిఐ(ఎం)
ఆహ్వానసంఘం, వరంగల్
ప్రచురణ, సంకలనకర్త:
తెలకపల్లి రవి,
పేజీలు: 176,
వెల: రూ.50/-
ప్రతులకు ప్రజాశక్తి అన్ని
బ్రాంచీలలో.

కోకోనట్ రవ్వ ఇడ్లీ

కావాల్సిన వస్తువులు

బియ్యపురవ్వ	:	2 కప్పులు
నూనె	:	4 టీ స్పూన్లు
పచ్చి శనగపప్పు	:	2 టీ స్పూన్లు
మినపప్పు	:	2 టీ స్పూన్లు
ఆవాలు	:	1 టీ స్పూన్,
ఎండిమిర్చి	:	3
కరివేపాకు	:	10 రెబ్బలు
పచ్చికొబ్బరి తురుము	:	1 కప్పు
ఉప్పు	:	తగినంత
జీరా	:	1/2 టీ స్పూన్

తయారు చేసే విధానం

రవ్వను ఇంట్లో తయారుచేసుకోవాలంటే, బియ్యాన్ని 1/2 గంట ముందుగా నానపెట్టాలి. తరువాత నీళ్ళు తీసి నానిన బియ్యాన్ని బట్టపై పరిచి ఎండలో ఆరబెట్టాలి. ఆరిన తరువాత మిక్సీలో వేసి రవ్వ మాదిరిగా చేసుకోవాలి. బాండీలో నూనె కాగిన తరువాత, ఎండుమిర్చి ముక్కలు, ఆవాలు, జీలకర్ర, శనగపప్పు, మినపపప్పు, కరివేపాకులతో తాలింపు వేయాలి. తరువాత మూడు కప్పల నీళ్ళు వేసి మరిగించాలి. అందులో తగినంత ఉప్పువేసి, బియ్యపురవ్వను ఉడికించాలి. ముద్దలా అయిన తరువాత తీసి కొబ్బరి తురుము వేసి బాగా కలియబెట్టాలి. చిన్న చిన్న ఉండలు రోల్స్ మాదిరిగా చేసుకోవాలి. ఇడ్లీల మాదిరి రోల్స్‌ను ఆవిరిమీద ఉడికించాలి. వేడివేడిగా కొబ్బరి చట్నీతో సర్వ్ చేయాలి. చాలా రుచిగా, ఆయిల్ లేకుండా ఉన్న కోకోనట్ రవ్వ రోల్స్ రెడీ. పిల్లలూ, పెద్దలు చాలా ఇష్టంగా తింటారు.

రుచి

బ్రెడ్ పెరుగు వడ

కావాల్సిన వస్తువులు

పెరుగు	:	1/2 కిలో,
ఉప్పు	:	తగినంత
తురిమిన పచ్చిమిర్చి	:	1/4 కప్పు
తురిమిన కొత్తిమీర	:	1/2 కప్పు,
స్లైసెస్ బ్రెడ్	:	ఒకటి
కారం	:	1/2 టీ స్పూన్
జీరాపొడి	:	1 టీ స్పూన్
నూనె	:	తగినంత

తయారు చేసే విధానం

బాండీలో నూనె వేసి కాచాలి. నీళ్ళలో బ్రెడ్ స్లైస్‌లను ముంచి తీశాక పిండి, గుండ్రని వడల మాదిరిగా చేయాలి. కొంచెం పలుచగా వత్తి, నూనెలో వేసి వేయించాలి. వేగిన ఆ వడలను నీళ్ళలో వేసి, నీరు పిండి తీసి ఒకబౌల్‌లో వరుసగా పెట్టాలి. పెరుగును బాగా చిలికి, ఉప్పు కొత్తిమీర తరుగు, పచ్చిమిర్చి తరుగు కలిపి బ్రెడ్ వడలపై పోయాలి. వాటిపై జీరాపొడి, కారం జల్లాలి. పది నిమిషాలలో బ్రెడ్ పెరుగువడలు రెడీగా ఉంటాయి. అతిథులు అనుకోకుండా వస్తే 10 నిమిషాలలో వాళ్ళకు ఈ బ్రెడ్‌పెరుగు వడలు చేసి పెట్టవచ్చు.

ఎలుగుబంటి బాటసారులు



మేకల మదన్ మోహన్ రావు

ఇద్దరు మిత్రులు పొరుగూరు వెళ్లాల్సి వచ్చింది. అలా వెళ్లాలంటే వారు ఒక పెద్ద అడవిని దాటాలి. మార్గమధ్యలో క్రూర జంతువుల బెడదనుంచి బయటపడేందుకు వీలుగా ఇద్దరూ కలిసి ప్రయాణం చేయాలనుకున్నారు. అనుకున్న ప్రకారం ఆహారం, నీళ్లు తీసుకుని బయలుదేరారు. అరణ్యమార్గం గుండా ప్రయాణిస్తుండగా వారికి ఒక ఎలుగుబంటి కనిపించింది. మొదట అది వాళ్లను గమనించలేదు.

కానీ మిత్రులలో ఒకడు మొదట దాన్ని చూశాడు. వాడు స్వార్థపరుడు, పిరికి వాడు. అంతే ఒక్క క్షణంలో పక్కనే వున్న పొడవాటి చెట్టుపైకి ఎక్కి చిటారు కొమ్మ మీదికి చేరిపోయాడు.

రెండవవాడు కూడా ఎలుగుబంటిని చూశాడు. కానీ అప్పటికే కాలాతీతమయింది. పరిగెత్తి పారిపోవటానికికానీ, ఏదో ఒక చెట్టు ఎక్కటానికికానీ సమయం లేదు.

అయితే అతడు తెలివితేటలు, సమయస్ఫూర్తి కలవాడు. క్షణంలో ఒక ఉపాయం ఆలోచించాడు. ఎలుగుబంటి చచ్చిన వాళ్లను తినదని అతనికి బాగా తెలుసు. వెంటనే చచ్చిపోయినవానిలా నేల మీద పడుకుండి పోయాడు.

అప్పుడొచ్చింది ఎలుగుబంటి. మొదట అతని తల దగ్గర వాసన చూసింది. అదొక మూర్ఖురాలు. అతను నిజంగానే చచ్చిపోయాడనుకుని అక్కడినుంచి వెళ్లిపోయింది.

అది కనుచూపుమేర దాటిపోయాక 'ఇంక భయంలేదు' అనుకుని చెట్టెక్కిన వాడు దిగి మిత్రుని దగ్గరకు వచ్చాడు.

కింద అలా పడుకుండిపోయిన మిత్రుడిని కాస్త ఆట పట్టిద్దామనుకున్నాడు. "ఆ ఎలుగుబంటి నీ చెవిలో ఏదో చెప్పి వెళ్లిపోయినట్టుగా నాకు కనిపించింది. అది నీతో ఏం చెప్పింది?" అని అడిగాడు.

"అదా... అది నాకు ఒక హెచ్చరిక చేసి వెళ్లిపోయింది"

"ఏంటా హెచ్చరిక"

"కొంతమంది ప్రమాద సూచిక కనిపించగానే స్నేహితులను సైతం వదిలిపెట్టి పోతారు. జాగ్రత్తగా వుండు అని హెచ్చరించి పోయింది" అన్నాడు.

ఆ మాటలు తనను ఉద్దేశించే మిత్రుడు చెప్పాడని అతనికి అర్థమైంది. దాంతో అతని ముఖం నల్లగా కమిలి పోయింది సిగ్గుతో.